

రామకుప్పం మండలంలో ఒంటరి ఏనుగు (ఫైల్ ఫొటో)

జిల్లాలో ఏనుగుల సంచారం పెరిగింది. ప్రాణ, పంట నష్టాలకు కారణమవుతున్నాయి. శనివారం రాత్రి చంద్రగిరి మండలం శేషాపురం సమీపంలో ఉప సర్పంచి రాకేష్‌చౌదరిని తొక్కి చంపేశాయి. ఈ క్రమంలో ఏనుగుల గుంపు వచ్చినప్పుడు ఏం చేయాలి? ఏం చేయకూడదు? ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? అనే వివరాలను అటవీశాఖ చీఫ్ కన్జర్వేటర్ సెల్వం 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు.

- మంగళం, ఆంధ్రజ్యోతి

భాకరాపేట, పనపాకం రేంజ్‌లో 15 గజరాజుల సంచారం

'ఆంధ్రజ్యోతి'తో సీసీఎఫ్ సెల్వం




కుప్పం ప్రాంతంలో ఏనుగులు (ఫైల్ ఫొటో)

ఒంటరి.. పిల్లలున్న ఏనుగులను

తరమొద్దు

భాకరాపేట, పనబాకం రేంజ్ పరిధిలో 15 ఏనుగుల గుంపు సంచరిస్తోంది. ఆహారం కోసం శేషాచల అటవీ సమీప పంట పొలాల్లోకి వస్తున్నాయి. ఏనుగులు పిల్లలకు జన్మనిచ్చినప్పుడు.. ఒంటరిగా ఉన్నప్పుడు చాలా ఆవేశంగా ఉంటాయి. చిన్న అలికిడికీ అవి చాలా తీవ్రంగా స్పందిస్తాయి. ఈ పరిస్థితుల్లో వీటిని తరిమే సాహసం చేయొద్దు. వాటికి 500 మీటర్ల దూరంలో ఉండాలి. అప్పుడే అవి దాడికి ప్రయత్నించినా తప్పించుకునే అవకాశాలుంటాయి. అంతకుమించి తక్కువ దూరంలో ఉంటే ఏనుగులు అతివేగంగా పరిగెత్తి దాడి చేయొచ్చు. ఏనుగులు ఉన్నప్పుడు జనం గుంపులుగా ఉండకూడదు. ఆ సమయంలో అవి దాడికి ప్రయత్నిస్తే తప్పించునే క్రమంలో ఒకరిని ఒకరు తోసుకోవడంతో కిందపడి.. ఏనుగులు బారినపడి ప్రాణాలు కోల్పోయే అవకాశాలున్నాయి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

ఏనుగులు తిరుగుతున్నాయని తెలిస్తే సాయంత్రం ఆరు నుంచి తెల్లవారుజాము వరకు ఆ వైపు వెళ్లకుండా ఉండటం మంచిది. రాత్రిపూట ఏనుగులు పంట పొలాల్లో ప్రజలను చూసినప్పుడు కనపడకుండా, శబ్దం చేయకుండా పక్కనే ఉంటాయి. పగటిపూటా ఇలాగే చెట్టు చాటున దాక్కుంటే సమీపానికి వెళ్లేంత వరకు వాటిని చూడలేం. రాత్రిపూట ఏనుగులు పంట పొలాల్లోకి వస్తే ఆ సమయంలో అక్కడికి వెళ్లేవారు డార్క్ కలర్ దుస్తులు వేసుకోవాలి. తెల్లరంగు, ఏనుగులకు వెలుతురుగా కనిపించే రంగు వేసుకోకూడదు. ఏనుగులను తప్పెట్లు, టపాకాయలు పేల్చి బలవంతంగా అటవీ ప్రాంతంలోకి పంపిస్తే అవి తిరిగి పంట పొలాల్లోకి వచ్చి ఎక్కువ నష్టం కలుగజేస్తాయి. వీటి పరిస్థితిని అర్థం చేసుకున్న అటవీశాఖ అధికారులు మాత్రమే ఏనుగుల గుంపును అడవిలోకి పంపడానికి ప్రయత్నిస్తారు. ఏనుగుల సమాచారంతో పాటు అవగాహన పెంచుకునేందుకు అటవీ సమీప గ్రామాల్లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నాం.

అటవీశాఖ సిబ్బందికి ప్రత్యేక శిక్షణ

కుంకీ ఏనుగుల ద్వారా ఏనుగులను తిరిగి అడవుల్లోకి పంపడానికి 30 మంది అటవీశాఖ సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇచ్చాం. ననియాల వద్ద రెండు కుంకీ ఏనుగులు ఉన్నాయి. కర్ణాటక నుంచి మరో నాలుగు తెప్పించే ప్రయత్నం చేస్తున్నాం.

నష్టపరిహారం పెంపు.. సత్వరం అందజేత

2024 జూన్‌లో ప్రభుత్వం నష్టపరిహారాన్ని పెంచింది. ఏనుగుల దాడిలో చనిపోయిన వ్యక్తులకు గతంలో నష్టపరిహారం రూ.5 లక్షలుంటే ఇప్పుడు రూ.10 లక్షలకు పెంచారు. అదీ 24 గంటల్లోనే అందజేస్తున్నారు. తీవ్రంగా గాయపడ్డ వారికి రూ.80 వేల నుంచి రూ.2 లక్షలకు పెంచగా.. స్వల్పంగా గాయపడ్డ వారికి రూ.25వేలు ఇస్తున్నారు. ఎకరా వరి పంటకు రూ.8వేల నుంచి రూ.10వేలకు, చెరకు పంటకు రూ.12వేలు, ఒక కొబ్బరి చెట్టుకు రూ.2వేలు, అరటిచెట్లకు ఎకరాలో నష్టాన్ని బట్టి రూ.24వేల చొప్పున.. వారం రోజుల్లోనే నష్టపరిహారం అందిస్తున్నారు.

ఏనుగులు కనపడ్డాయంటే..

ఎవరికైనా ఏనుగులు కనిపిస్తే 1800 4255909 టోల్ ఫ్రీ నెంబరుకు లేదా ఆ ప్రాంత అటవీశాఖ సిబ్బందికి సమాచారం ఇవ్వాలి.


ఒకప్పుడు మన జిల్లా
ఉద్యమాల ఖిల్లా!
- 8లో

ఉదయం పెళ్లి పీటలపై..

సాయంత్రం ఉరితాడుకు వేలాడుతూ..

- ఆంబాకంలో నవ వధువు బలవన్మరణం



సత్యవేడు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): కాళ్ల పారాణి ఆరలేదు. నుదుట భాసికం తీయనేలేదు. తలపై వేసిన అక్షతలు రాలనేలేదు. మంగళ వాయిద్యాల సందడి సద్దుమణగనే లేదు. పెళ్లి పీటలెక్కి గంటలైనా గడవ లేదు.. అంతలోనే ఆ వధువు అనంతలోకాలకు తరలి వెళ్లింది. ఉదయం పెళ్లి జరగ్గా.. సాయంత్రానికి బలవన్మరణానికి పాల్పడింది. సత్యవేడు మండలం ఆంబాకంలో సోమవారం సాయంత్రం ఈ విషాద ఘటన జరిగింది. ఎస్‌ఐ రామస్వామి తెలిపిన ప్రకారం.. ఆంబాకానికి చెందిన ధనుంజయ, రధి దంపతుల కుమార్తె ఆర్తి(20) చెన్నైలోని ఓ ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ ఫైనలియర్ చదువుతోంది. అదే గ్రామానికి చెందిన మేనమామ సూర్యతో ఈమెకు వివాహం నిశ్చయమైంది. ఊతుకోటలో సోమవారం వీరిద్దరి వివాహం జరిపించారు. అటునుంచే వధూవరులు తిరుత్తణి ఆలయానికి వెళ్లారు. మధ్యాహ్నం వరుడు సూర్య ఇంటికి వచ్చారు. తనకు అలసటగా ఉందంటూ నిద్ర పోయేందుకు బెడ్‌రూంలోకి వెళ్లిన ఆర్తి తలుపులు వేసుకుంది. సాయంత్రం అవుతున్నా బయటకు రాలేదు. ఎంత పిలిచినా పలకలేదు. కుటుంబ సభ్యులకు అనుమానం వచ్చి గడియ పగులకొట్టి చూడగా ఫ్యాన్‌కు ఉరేసుకుని ఉంది. వెంటనే ఆమెను ఊతుకోటలోని ఆస్పత్రికి తీసుకెళ్లగా, అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ రామస్వామి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్యవేడు ప్రభుత్వాస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పెళ్లయిన గంటల్లోనే పెళ్లికూతురు మృతి చెందడంతో గ్రామంలో విషాదం నెలకొంది.

భార్య అరుణతో..



మావోయిస్టు
చలపతి

తవణంపల్లె మండలం మత్యంపైపల్లె వాసి

మదనపల్లె పట్టుశాఖలో పూర్వ ఉద్యోగి

సెంట్రల్ కమిటీ దాకా ఎదిగిన చలపతి అలియాస్ రామచంద్రారెడ్డి గారి ప్రతాప్ రెడ్డి పై జిల్లాలో చర్చ

మన జిల్లా వాడే!


ఛత్తీస్‌గఢ్ అడవుల్లో చలపతి మృతదేహం

చిత్తూరు అర్బన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఒడిశా-ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని గరియా బంద్ జిల్లా కులారిఘాట్ అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరణించిన చలపతి అలియాస్ రామచంద్రారెడ్డి గారి ప్రతాప్‌రెడ్డి ఉమ్మడి చిత్తూరు జిల్లావాసి అని తెలియడంతో జిల్లాల్లో విస్తృత చర్చ జరుగుతోంది. జిల్లా నుంచి ఇంకా ఇంత పెద్ద నాయకుడు మావోయిస్టుల్లో ఉన్నాడా అని అందరూ ఆశ్చర్యపోతున్నారు. చలపతి స్వస్థలం అయిన తవణంపల్లె మండలం మత్యంపైపల్లె గ్రామంలో అయితే ఏ వివరాలు చెబితే ఏమవుతుందో అని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. చలపతికి తమ ఊరికి అసలు సంబంధమే లేదని చెబుతున్నారు. ఈయన అన్న కుమారుడు ఒకరు ఇప్పటికీ గ్రామంలో ఉన్నారు. మరో అన్న మదనపల్లె పట్టుపరిశ్రమ శాఖలో పనిచేస్తున్నారు. అయితే బంధుత్వాలు చెప్పుకోవడానికి వీరు ఇష్టపడడం లేదు. చలపతి తల్లిదండ్రులు మరణించారు. ఆయనకు ఇద్దరు అన్నలని ఒకరు మరణించగా మరొకరు ప్రభుత్వ ఉద్యోగి అని సమాచారం.

70 ఏళ్ల కిందటే ఊరొదిలేశారు

చలపతి పుట్టకముందే వారి తల్లిదండ్రులు మత్యం పైపల్లె గ్రామాన్ని వదిలి వెళ్లిపోయినట్లు స్థానికులు చెబుతున్నారు. చలపతి తండ్రి, తాత పుట్టింది ఇక్కడే అని, 70 ఏళ్ల కిందటే అప్పట్లో ఉన్న పూరి గుడిసె, ఉన్న కొద్దిపాటి స్థలాన్ని అమ్ముకుని గ్రామాన్ని వదిలి వెళ్లిపోయారని, దాంతో వారికి ఈ గ్రామంతో ఎలాంటి సంబంధం లేదని స్థానికులు చెబుతున్నారు.

ప్రభుత్వ ఉద్యోగాన్ని వదిలి.. : చలపతి మదనపల్లెలో పట్టుశాఖలో పనిచేస్తూ విశాఖ జిల్లాకు బదిలీ అయ్యారని, అక్కడి పరిచయాలే ఆయనను మావోయిస్టుగా మార్చాయని తెలుస్తోంది. ఉద్యోగాన్ని సైతం వదిలేసి అజ్ఞాత జీవితాన్ని ఎంచుకున్నారని, ఆ ప్రాంతానికే చెందిన మావోయిస్టు నాయకురాలు అరుణతో ఆయనకు పెళ్లి కూడా అయ్యిందని అంటున్నారు.

ఎన్నోసార్లు తప్పించుకుని.. : గతంలో అనేక సందర్భాల్లో ఎదురుకాల్పుల్లో తప్పించుకున్న చలపతి ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్‌లో బలైపోయారు. ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల పోలీసులతో పాటు సీఆర్‌పీఎఫ్ సిబ్బంది దాదాపు వెయ్యి మందికి పైగా కలిసి చేపట్టిన ప్రత్యేక ఆపరేషన్‌లో మరణించిన 20 మంది మావోయిస్టులలో ఆయన ఒకడయ్యారు.

గొప్ప వ్యూహకర్త

అంకితభావం గల గెరిల్లాగా చలపతి మావోయిస్టు పార్టీలో అగ్రనాయకుడిగా ఎదిగారు. మంచి వ్యూహకర్త గా ఆ పార్టీలో పేరు తెచ్చుకున్నారు. 2003లో అప్పటి సీఎం చంద్రబాబు మీద అలిపిరి వద్ద నక్సల్స్ చేసిన దాడిలోనూ చలపతి పాత్ర ఉందని పోలీసులు భావించారు. 2018లో టీడీపీ అరకు ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే సివేరి సోములను కాల్చి చంపిన ఘటనలోనూ చలపతి సూత్రధారి అని తెలుస్తోంది. ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన చలపతి ఒడిస్సా రాష్ట్ర మావోయిస్టు కార్యదర్శిగా కూడా వ్యవహరిస్తున్నట్లు పోలీసులు చెబుతున్నారు. ఇప్పటికే ఇతడిపై రూ.కోటి రివార్డును కూడా ఆ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈయనను హతమార్చినందుకు కేంద్ర హోం మంత్రి ఎక్స్ వేదికగా బలగాలను అభినందించారు కూడా. ఇంత కీలకమైన మావోయిస్టు నాయకుడు జిల్లాకు చెందినవాడు కావడం పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు.

విధేయతకు పట్టం

- బీజేపీ జిల్లా సారథిగా సామంచి


సామంచిని సన్మానిస్తున్న బీజేపీ నాయకులు



తిరుపతి, జనవరి21(ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ జిల్లా నూతన అధ్యక్షుడుగా సామంచి శ్రీనివాస్ ఎన్నికయ్యారు. తిరుపతిలో మంగళవారం జరిగిన బీజేపీ అధ్యక్ష ఎన్నికల్లో సామంచిని ఆ పార్టీ ప్రముఖుల సమక్షంలో ఎన్నికల అధికారి పి.సురేందర్‌రెడ్డి ప్రకటించారు. విద్యార్థి దశ నుంచే ఆర్‌ఎస్‌ఎస్ (రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్)చేరిన సామంచి తనదైన గుర్తింపు తెచ్చుకున్నారు. 1989 నుంచి 99వరకు నగర కార్యదర్శిగా, జిల్లా కన్వీనర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా పదేళ్ల పాటు వివిధ హోదాల్లో పనిచేశారు. 1999లో బీజేపీలో చేరిన ఆయన క్షేత్రస్థాయి నుంచి వివిధ హోదాల్లో చురుగ్గా వ్యవహరించారు. తాజాగా రాష్ట్ర అధికార ప్రతినిధిగా ఉంటూ తిరుపతి జిల్లా అధ్యక్షుడిగా నియమితులయ్యారు. సుదీర్ఘకాలం పార్టీకి సేవలందించినప్పటికీ అధికారిక పదవులు దక్కలేదని ఏనాడూ అసంతృప్తిచెందని వ్యక్తిగా సామంచికి మంచి పేరుంది. అతడి విధేయతను గుర్తించిన అధిష్ఠానం జిల్లా బాధ్యతలను అప్పగించినట్టు పార్టీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

ప్రతి ఇంటికీ బీజేపీ నా లక్ష్యం

జిల్లాలో పార్టీ విస్తరణే లక్ష్యంగా కార్యకర్తలను కలుపుకొని ప్రతి ఇంటికీ వెళ్తానని నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ అన్నారు. కూటమి అధికారంలోకి రావడానికి బీజేపీ కార్యకర్తల కృషి, పట్టుదల ఉందన్నారు. అభివృద్ధే నినాదంతో తిరుపతిలో నిధులు వెచ్చిస్తున్న బీజేపీ అదే స్థాయిలో పార్టీని బలపరచుకోవడానికి అందరం కలిసి పని చేద్దామని పిలుపునిచ్చారు. పార్టీ కోసం పని చేసే ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుందన్నారు. సభ్యత్వ నమోదులో తిరుపతి మూడో స్థానం సాధించడంపై కృతజ్ఞతలు తెలిపారు. బీజేపీ సిద్ధాంతాలు, కార్యకర్తల క్రమశిక్షణకే పెద్దపీట వేసి బూత్‌స్థాయి నుంచి మండల, జిల్లా స్థాయి వరకు అందరి అభిప్రాయాల మేరకు ఎన్నికలు జరుగుతాయనే విషయాన్ని గుర్తించాలన్నారు. అనంతరం నేతలు, కార్యకర్తలు సామంచి శ్రీనివాస్‌ను సత్కరించారు. ఒక పని చేయడానికి బాధ్యతలు తీసుకుంటే సరిపోదని బాధ్యతతో పనిచేస్తేనే ఆ పనిలో వందశాతం విజయం సాధించగలమని జిల్లా ఎన్నికల అధికారి సురేంద్రరెడ్డి చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దయాకర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు కోలా ఆనంద్, మట్టా ప్రసాద్, మాజీ అధ్యక్షుడు చంద్రప్ప, సీనియర్ నాయకులు చంద్రారెడ్డి, కంద్రిగ ఉమా, ఎస్‌ఎస్‌ఆర్ నాయుడు, రాటకొండ విశ్వనాథ్, సుబ్రహ్మణ్యం యాదవ్, పొనగంటి భాస్కర్, అజయ్‌కుమార్, వరప్రసాద్, పెనుబాల చంద్రశేఖర్, బీడీ బాలాజీ, వెంకటముని, డాక్టర్ శ్రీహరిరావు, జిల్లానుంచి పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

24న నూతన ఎస్పీ బాధ్యతల స్వీకరణ

తిరుపతి(నేరవిభాగం), జనవరి 21(ఆంధ్రజ్యోతి): జిల్లా ఎస్పీగా నియమితులైన హర్షవర్ధనరాజు ఈ నెల 24న బాధ్యతలు స్వీకరించనున్నారు. గురువారం సాయంత్రం తిరుపతికి చేరుకుని అక్కడ నుంచి తిరుమలకు వెళ్ళి శ్రీవారిని దర్శించుకుంటారు. అనంతరం తిరుపతిలోని జిల్లా పోలీసు కార్యాలయానికి చేరుకుని బాధ్యతలు తీసుకోనున్నారు.

24న స్పాట్ అడ్మిషన్లు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 21 (ఆంధ్రజ్యోతి): పద్మావతి మహిళా పాలిటెక్నిక్ కాలేజీ నిర్వహిస్తున్న ఫార్మసీ డిప్లొమో కోర్సులో ప్రవేశానికి ఈ నెల 24 వ తేది స్పాట్ అడ్మిషన్లు చేపట్టనున్నారు. ఇంటర్‌లో ఎంపీసీ కానీ, బైపీసీ కానీ పూర్తి చేసిన వారు అర్హులు. ఆసక్తి కలిగిన వారు 23వ తేదీ సాయంత్రం లోపు దరఖాస్తు చేసుకోవాలి. ప్రభుత్వం నిర్ణయించిన కోర్సు ఫీజుతో విద్యార్థినులకు ఉచిత హాస్టల్ వసతి కల్పించనున్నారు. మరింత సమాచారం కోసం 92990 08151 నెంబరులో సంప్రదించవచ్చు.

భూముల రీసర్వే ప్రారంభం



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ పరమేశ్వర స్వామి

ఎర్రావారిపాలెం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉదయ మాణిక్యం గ్రామంలో భూముల రీసర్వే కార్యక్రమాన్ని మంగళవారం తహసీల్దార్ పరమేశ్వరస్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని రైతులకు సమస్యాత్మకంగా ఉన్న భూములను రీసర్వే చేపట్టన్నుట్లు తెలిపారు. తేడా ఉన్న రైతుల భూములను సర్వే చేసి కచ్చితంగా హద్దులు, విస్తీర్ణం చూపనున్నట్లు చెప్పారు. కొన్ని సర్వే నెంబర్లు వాస్తవ విస్తీర్ణం కంటే ఆన్‌లైన్‌లో తప్పుగా నమోదయ్యాయని, గతంలో రెవెన్యూ అధికారులు చేసిన తప్పిదానికి తాము మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని రైతులు తహసీలార్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ కార్య క్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు దేశిరెడ్డి రఘునాథ, తెలుగుమహిళ అధ్యక్షురాలు కుమక లక్ష్మీదేవి, బీసీ సాధికార సమితి అధ్యక్షురాలు దేవి తదితరులు పాల్గొన్నారు.

పశు వైద్య శిబిరాలు ప్రారంభం


కొండ్రెడ్డికండ్రిగలో పశువులకు వైద్య సేవలు అందిస్తున్న దృశ్యం

చంద్రగిరి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండ్రెడ్డి కండ్రిగ, ఎగువ కూచివారిపల్లి గ్రామాల్లో మంగళవారం పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి వంశీ మాట్లాడుతూ.. ఆ రెండు గ్రామాలకు సంబంధించి 536 జీవాలకు వైద్య సహాయం అందించామని, దాదాపు 51 మంది రైతులు లబ్ధి పొందినట్లు తెలిపారు. అందులో 198 సీమ ఆవులు, నాటు ఆవులకు, 93 దూడలకు, 245 మేకలు, గొర్రెలకు నట్టల నివారణ మందు అందించినట్లు ఆయన చెప్పారు. బుటాక్స్(సైపతర్మేత్రిన్), ఈగలు, పిడిదుల నివారణ మందును అన్ని జీవాలకు పిచికారి చేశారు. పశు వైద్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

పాడి రైతుల శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యం

భాకరాపేట, జనవరి 21(ఆంధ్రజ్యోతి): పాడి రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందడమే ప్రభుత్వ లక్ష్యమని చిన్నగొట్టిగల్లు టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్ శివకుమార్ అన్నారు. చిన్నగొట్టిగల్లు మండలం టి.కుమ్మరపల్లె, తవ్వావాండ్లపల్లె గ్రామాల్లో మంగళవారం పశు ఆరోగ్య శిబిరాలు జరిగాయి. ఈ సందర్భంగా పశువులకు వివిధ రకాల పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. పశువుల బీమాపై అవగాహన కల్పించారు. పశుసంవర్థక శాఖ ద్వారా రైతులకు అందే ప్రయోజనాలను వివరించారు. అనంతరం రైతులకు మినరల్ మిక్చర్‌ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ రమణ కుమార్, పశువైద్యాధికారి స్రవంతి, వెటర్నరీ అసిస్టెంట్లు సురేశ్, శివకుమార్, గోపీ, టీడీపీ నేతలు బెల్లంకొండ రమణ, వెంకటసుబ్బయ్య, నాగభూషణం, మునిరాజా, అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కుకు చంద్రబాబు కృషితో ఆర్థిక భరోసా

● ఎమ్మెల్యే పులివర్తి నాని

చంద్రగిరి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కృషితో ఆర్థిక భరోసా లభించిందని ఎమ్మెల్యే పులివర్తి నాని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీయే ప్రభుత్వం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చొరవతో విశాఖ ఉక్కు పరిశ్రమకు జవసత్వాలు నింపడానికి రూ.11,440 కోట్ల ప్యాకేజీ మంజూరు చేసిందని గుర్తు చేశారు. ఈనిధుల విడుదలతో అసత్య ప్రచారాలు చేసిన వైసీపీ నోళ్లు మూతలు పడ్డాయన్నారు. ఈ పరిణామం ఉత్తరాంధ్ర ప్రజలకే కాకుండా యావత్ రాష్ట్రానికే గొప్ప శుభవార్త అన్నారు. పలుమార్లు హస్తినకు వెళ్లి తన పైన ఉన్న కేసులను ఎత్తివేయించుకోవాలని ప్రయత్నం చేసిన జగన్మోహన్ రెడ్డి.. ఆయన పేటీఎం బ్యాచ్.. సీఎం చంద్రబాబు పర్యటనలను హేళన చేశారని, అయితే ఇది మాటల ప్రభుత్వం కాదని చేతల ప్రభుత్వం అని రుజువు చేసిందన్నారు. ఇకనైనా వైసీపీ పేటీఎం బ్యాచ్ ఈ విషయం తెలుసుకొంటే మంచిదని ఆయన హితవు పలికారు.

ఈ-పంట నమోదు తప్పనిసరి



ఎల్లమందలో మాట్లాడుతున్న ఏవో ఖాదర్‌బాషా

ఎర్రావారిపాలెం, జనవరి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రతి రైతు తాము సాగు చేసిన పంటల వివరాలను తప్పనిసరిగా ఈ-పంటలో నమోదు చేసుకోవాలని ఏవో ఖాదర్ బాషా తెలిపారు. మంగళవారం ఉస్తికాయలపెంట, ఎల్లమంద గ్రామాల్లో పొలం బడి కార్యక్రమం జరిగింది.వేరుశనగ, ఉలవ పంట సాగును పొలాల్లో పరిశీలించారు. రైతులకు అందిస్తున్న ప్రభుత్వ పథకాల గురించి అవగాహన కల్పించారు. సేంద్రియ ఎరువు వాడకం పెంచి, రసాయన ఎరువుల వినియోగం తగ్గిస్తే నేల సారం పెరుగుతుందని సూచించారు. సేంద్రియ పంటలు మంచి ధర పలుకుతాయన్నారు. రైతు సేవా కేంద్రాల్లో సిబ్బంది రైతులకు ప్రభుత్వ పథకాలు, సాగు మెలకువల గురించి అవగాహన కల్పించాలని చెప్పారు.

సమగ్ర యాజమాన్య పద్ధతులతో తెగుళ్ల నివారణ

భాకరాపేట, జనవరి 21(ఆంధ్రజ్యోతి): సమగ్ర యాజమాన్య పద్ధతులతో పంటలను ఆశించే తెగుళ్లను నివారించవచ్చునని మండల వ్యవసాయ అధికారిణి ధనలక్ష్మి తెలిపారు. చిన్నగొట్టిగల్లు మండలం రంగన్నగారిగడ్డ గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ-పంట నమోదు, దాని ప్రయోజనాలు, పంట బీమా, ఎరువుల యాజమాన్య పద్ధతులు, తెగుళ్ల నివారణ అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. రబీ సీజన్‌లో వేసిన నారుమడులు, ఉలవ పంటను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యాలకు అనుగుణంగా విద్యాబోధన చేయాలి


పరిశీలిస్తున్న శివశంకరయ్య

రామచంద్రాపురం, జనవరి 21(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సామర్థ్యాలకు అనుగుణంగా ఉపాధ్యాయులు విద్యాబోధన చేయాలని సమగ్ర శిక్ష అకడమిక్ మానటరింగ్ ఆఫీసర్ శివశంకరయ్య అన్నారు. మంగళవారం సిద్ధేశ్వర ఎస్టీకాలనీ, పీవీపురం పాఠశాలలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల సామర్థ్యాల ఆధారంగా వారి ప్రగతిని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరు కావాలన్నారు. అనంతరం మధ్యాహ్నభోజన నాణ్యతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో మార్కొండయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ ప్రత్యేక కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి


చిన్నపిల్లలకు ఆధార్ నమోదు చేస్తున్న సచివాలయ సిబ్బంది

భాకరాపేట, జనవరి 21(ఆంధ్రజ్యోతి): చిన్నగొట్టిగల్లు మండలం చట్టేవారిపాళెం సచివాలయంలో నిర్వహిస్తున్న ఆధార్ ప్రత్యేక కేంద్రాలను విద్యార్థులు, చిన్నపిల్లలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో గిడ్డయ్య తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 30వ తేదీ వరకు ఆధార్ కేంద్రాలు ఉంటాయని, భాకరాపేట, దిగవూరు, ఎగువూరు, చిట్టేచర్ల, దీన్‌దార్లపల్లె, దేవరకొండ గ్రామాల్లోని 5 ఏళ్లలోపు పిల్లలు కొత్తగా ఆధార్ కార్డులను నమోదు చేసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మల్లికార్జున రెడ్డి, డిజిటల్ అసిస్టెంట్ వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డిసేబుల్ పింఛన్ల పరిశీలన


పరీక్షిస్తున్న వైద్యులు

రామచంద్రాపురం, జనవరి 21(ఆంధ్ర జ్యోతి): ఎన్టీఆర్ సామాజిక భద్రతా పింఛన్లు(డిసేబుల్) పొందుతున్న లబ్ధిదారుల్లో అనర్హులను గుర్తించేందుకు ప్రభుత్వం ప్రత్యేక వైద్యబృందంతో క్షేత్రస్థాయిలో పరిశీలన చేయిస్తోందని ఎంపీడీవో ఇందిరమ్మ తెలిపారు. మంగళవారం మండలంలోని సి.రామాపురం, కమ్మకండ్రిగ, నడవలూరు పంచాయతీల్లో వైద్యులు జావీద్, రవిబాబు, సునీల్ డిసేబుల్ పింఛన్ల పంపిణీ పరిశీలన కార్యక్రమాన్ని చేపట్టారు. దీర్ఘకాలిక వ్యాధులతో మంచానికే పరిమితమైన వారి ఇళ్లకు వెళ్లి వాస్తవాలను పరిశీలించారు. వారిచే వేలిముద్రలు, ఫొటోలు తీసి అప్‌లోడ్ చేశారు. బుధవారం కూడా కొనసాగుతుందని ఎంపీడీవో తెలిపారు. డిసేబుల్ పింఛన్లు పొందుతున్న వారు మొత్తం 45మంది ఉన్నారని, ప్రస్తుతం 19మంది ఇళ్లకు వెళ్లి పరిశీలించామని డాక్టర్ జావిద్ తెలిపారు. 27న మండలంలో పింఛన్ల పరిశీలన కార్యక్రమాన్ని ముగిస్తామన్నారు. ఈవోపీఆర్డీ చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్యాన్సర్‌పై అవగాహన


కార్యక్రమంలో పాల్గొన్న కూటమి పార్టీల నాయకులు, టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్యాన్సర్‌సంస్థ ప్రతినిధులు

తిరుపతి రూరల్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): ఎంఆర్‌పల్లె జడ్పీ హైస్కూల్‌లో తిరుపతి జనతాసేవామిత్ర హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ, స్థానిక కూటమిపార్టీ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు క్యాన్సర్‌పై అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్యాన్సర్ సంస్థ ప్రతినిధులు హాజరై.. క్యాన్సర్‌ని ప్రాథమిక దశలో గుర్తించడం, తీసుకోవాల్సిన నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. ఎంఆర్‌పల్లె జనసేన అధ్యక్షుడు, వన్నియకుల క్షత్రియ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ అయ్యంగారు బాలసుబ్రమణ్యం, వార్డు అధ్యక్షులు రంగారెడ్డి, జానకిరామిరెడ్డి, మునిప్రకాశ్, లవకుమార్, ధరణికుమార్, ప్రభు, వెంకటమునిరెడ్డి, జనతా సేవామిత్ర సంస్థ సభ్యులు బాలగోపాల్, పురుషోత్తంరెడ్డి, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రపతి విందుకు చిత్తూరు మహిళకు ఆహ్వానం

- పీఎంఏవై కింద ఇల్లు కట్టుకోవడంతో అవకాశం


సల్మాకు ఆహ్వానపత్రికను అందిస్తున్న తపాలాశాఖ అధికారులు

చిత్తూరు అర్బన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): సామాన్య పేద కుటుంబానికి చెందిన ఓ మహిళ రాష్ట్రపతి భవన్‌లో ఈనెల 26వ తేదీన గణతంత్ర దినోత్సవం సందర్భంగా సాయంత్రం 4 గంటలకు జరిగే విందుకు ఎంపికైంది. కేంద్ర ప్రభుత్వం వివిధ పథకాల కింద దేశ వ్యాప్తంగా లబ్ధిదారులను ఎంపిక చేశారు. ఈ నేపథ్యంలో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (అర్బన్) కింద ఇల్లు కట్టుకున్న చిత్తూరు న్యూ ప్రశాంత్‌నగర్‌కు చెందిన సల్మా ఎంపికయ్యారు. ఇందుకు సంబంధించిన ఆహ్వాన లేఖను తపాలాశాఖ అసిస్టెంట్ సూపరింటెండెంట్ గణపతి, అసిస్టెంట్ పోస్టుమాస్టర్ భాస్కర్, పోస్టు ఉమెన్ లక్ష్మీప్రసన్నలతోపాటు హౌసింగ్ ఏఈ శ్రీధర్ స్వయంగా వెళ్లి సల్మాకు మంగళవారం అందించారు. సల్మాతోపాటు ఆమె భర్త సర్దార్ షరీఫ్‌కు ప్రయాణ ఖర్చులతోపాటు ఢిల్లీలో వసతి, ఇతర సౌకర్యాలను రాష్ట్రపతి భవనే భరిస్తుంది.

నేడు ద్రావిడ వర్సిటీకి న్యాక్ కమిటీ రాక

గుడుపల్లె, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ద్రావిడ విశ్వవిద్యాలయానికి ఈనెల 22న బుధవారం న్యాక్ సభ్యుల బృందం సందర్శించనున్నట్లు ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య కిరణ్ కుమార్ తెలిపారు. ఏడుగురు సభ్యులతో కూడిన న్యాక్ పీర్ టీమ్ వర్సిటీలోని ప్రతి విభాగాన్ని మూడు రోజులపాటుసందర్శించనుంది. విశ్వవిద్యాలయానికి సంబంధిన పూర్తి సమాచారాన్ని ఇప్పటికే అధికారులు న్యాక్ కార్యాలయానికిఅందించారు. న్యాక్ టీమ్ కమిటీ సందర్శన అనంతరం విశ్వవిద్యాలయాకి న్యాక్‌గ్రేడింగ్ ఇవ్వనుంది. గతంలో విశ్వవిద్యాలయానికి బి-ప్లస్ ఇవ్వగా.. ఈసారి ఏగ్రేడ్ వస్తుందని అధికారులు పేర్కొంటున్నారు.

కాణిపాకం పాఠశాలకు జాతీయ గ్రీన్ స్కూల్ అవార్డు

ఐరాల(కాణిపాకం), జనవరి21(ఆంధ్రజ్యోతి): కాణిపాకం జడ్పీ ఉన్నత పాఠశాలకు 2024-25వ సంవత్సరానికి జాతీయస్థాయిలో గ్రీన్ స్కూల్ అవార్డు వచ్చిందని హెచ్‌ఎం చంద్రశేఖర్‌నాయుడు మంగళవారం తెలిపారు. పాఠశాలలోని ఆహ్లాదకర వాతావరణాన్ని న్యూఢిల్లీలోని సీఎస్‌ఈ (సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్)కి రాష్ట్రవ్యాప్తంగా ఫొటోలను పంపామన్నారు. మన రాష్ట్రం నుంచి 12 పాఠశాలలు ఎంపికవగా, ఇందులో తమ స్కూల్ ఉండటం ఆనందంగా ఉందన్నారు. ఈ అవార్డుకు తమ పాఠశాల వరుసగా మూడోసారి ఎంపిక కావడం గర్వంగా ఉందన్నారు. ఈ అవార్డును ఫిబ్రవరి 4న న్యూఢిల్లీలో అందుకుంటామని, ఈ అవార్డు రావడానికి కారణమైన సైన్స్ ఉపాధ్యాయుడు సురేంద్రబాబును, సహకరించిన టీచర్లు సోమశేఖర్‌నాయుడు, బాలయ్య, బాలసుబ్రహ్మణ్యం, మాధవరెడ్డి, నరేష్‌బాబును అభినందించారు.

కోలాహలంగా పశువుల పండుగ


పశువుల పండుగను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

పాకాల, జనవరి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని గాదంకి గ్రామంలో మంగళవారం పశువుల పండుగను కోలాహలంగా జరుపుకున్నారు. పశువులను శుభ్రం చేసి కొమ్ములకు రంగులు వేసి కొప్పులు తొడిగి అందంగా అలంకరించారు. రాజకీయ నాయకుల, సినీనటుల ఫొటోలతో కూడిన పలకలను కొమ్ములకు కట్టారు. గ్రామ దేవతకు పూజలు చేసి ప్రదర్శన నిర్వహించారు. ఎమ్మెల్యే పులివర్తి నాని ముఖ్య అతిథిగా పాల్గొని జల్లికట్టు ప్రారంభించారు. కోడెగిత్తల కొమ్ములకు కట్టిన పట్టీలను, బహుమతులను చేజిక్కించుకోవడానికి యువత పోటీ పడి వాటి వెంట పరుగులు తీశారు. స్వల్పగాయాలను లెక్క చేయకుండా ఆనందోత్సాహాలతో సందడి చేశారు. పశువుల పండుగను తిలకించడానికి పరిసర ప్రాంతాల నుంచి భారీగా ప్రజలు తరలిరాగా, నిర్వాహకులు భోజనం, తాగునీటి వసతి కల్పించారు.

విద్యతో పాటు క్రీడలూ అవసరమే

● శాప్ చైర్మన్ రవినాయుడు


స్పోర్ట్స్ మీట్‌లో పాల్గొన్న రవినాయుడు, గంటా రవితేజ

చంద్రగిరి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు విద్యతో పాటు మానసిక శారీరక, ఆరోగ్యానికి క్రీడలు ఎంతో అవసరమని ఏపీ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ అనిమిని రవినాయుడు అన్నారు. మండలంలోని శ్రీనివాసమంగాపురం సమీపంలోని నారాయణ పాఠశాలలో జరుగుతున్న జోనల్ క్రీడా పోటీలు మంగళవారంతో ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శాప్ చైర్మన్ రవినాయుడు, నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్ గంటా రవితేజ, డీజీఎం కొండలరావు విచ్చేశారు. రవినాయుడు మాట్లాడుతూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో చదువుకునే విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లో కూడా రాణించేందుకు అవసరమైన ప్రణాళిక రూపొందిస్తున్నారని తెలిపారు. 2027 నాటికి నేషనల్ గేమ్స్‌ను అమరావతిలో నిర్వహించడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. గంటా రవితేజ మాట్లాడుతూ మంత్రి నారాయణ ఈ విద్యాసంస్థలను 45 సంవత్సరాలు కష్టపడి ఈస్థాయికి తీసుకురావడం గర్వకారణంగా ఉందన్నారు. అనంతరం క్రీడాకారులకు మెమెంటోలు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం శ్రీనివాసులు, గోపీనాథ్, సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

కార్యదర్శుల కార్యవర్గం


వెంకటేశ్వర్లు, నరసింహులు

తిరుపతి రూరల్, జనవరి 21 (ఆంధ్ర జ్యోతి): తిరుపతి రూరల్ మండల పంచాయతీ కార్యదర్శుల సంఘ నూతన కార్యవర్గాన్ని మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా పెయ్యల వెంకటేశ్వర్లు (తుమ్మలగుంట), ప్రధాన కార్యదర్శిగా ఎస్.నరసింహులు (దుర్గసముద్రం), ఉపాధ్యక్షులుగా స్వర్ణమంజుల, కె.నాగరాజు, ఏపీలోకేష్‌బాబు, కోశాధికారిగా ఎ.గోపి, సంయుక్త కార్యదర్శులుగా ఎ.ఝాన్సీ, తేజ, సభ్యులుగా సుజాత, స్వాతిశ్రీ, లావణ్య, జ్యోతిప్రసాద్‌ను ఎన్నుకున్నట్లు ప్రకటించారు. నూతన కార్యవర్గ ప్రతినిధులు మాట్లాడుతూ.. కార్యదర్శుల సంక్షేమం, సమస్యల పరిష్కారానికి శక్తివంచనలేకుండా కృషిచేస్తామని తెలిపారు.

పంచాయతీల అభివృద్ధికి బాధ్యతగా పనిచేయాలి

- ఎమ్మెల్యే పులివర్తి నాని


మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాని

తిరుపతి రూరల్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల అభివృద్ధికి అధికారులు బాధ్యతగా పనిచేయాలని ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. తిరుపతి రూరల్ మండలంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లతో అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పార్టీలకు అతీతంగా పంచాయతీల అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని చెప్పారు. మండల పరిధిలో ఎన్ఆర్ఈజీఎస్, ఇతర నిధులు కలిపి మొత్తం రూ.5.42కోట్లతో పలుఅభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామని వివరించారు. గ్రామాల్లో డ్రైనేజీ, పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించి.. కాలువలు, ఖాళీ ప్రదేశాల్లో చెత్త, వ్యర్థాలు లేకుండా ఎప్పటికప్పుడు తొలగించాలని ఆదేశించారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ లోపంపై మంగళవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురించిన అధ్వాన డ్రైనేజీ వ్యవస్థతో అవస్థలు కథనాన్ని ఉదహరిస్తూ పంచాయతీ అధికారులు నామమాత్రంగా కాకుండా బాధ్యతాయుతంగా పనిచేయాలని తెలిపారు. మండలంలో తాగునీరు, డ్రైనేజీ, సీసీరోడ్లు, ఇంటి పట్టాలు, సచివాలయ భవన నిర్మాణ పనులు, శ్మశాన వాటిక స్థలం, యూడీఎస్, కరెంట్ మీటర్లు తదితర సమస్యలను సర్పంచులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. పాడిపేట సర్పంచ్ మాట్లాడుతూ.. తమ గ్రామం మీదుగా రోజూ దాదాపు 50 ట్రాక్టర్ల ఇసుక తరలిస్తుండడంతో సీసీ, తారు రోడ్లు దెబ్బతింటున్నాయని, చిన్నపిల్లలు, వృద్ధులు రోడ్డుపైకి రావడానికి ఇబ్బంది పడుతున్నారని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే రోడ్డు వేసిన ఏడాదికే మరమ్మతులకు గురికావడం ఏమిటని, రోడ్డు నాణ్యతపై విజిలెన్స్ విచారణ వేయాలని, దీనికి ప్రత్యామ్నాయంగా డైవర్షన్ దారి ఉంటే పరిశీలించాలని ఎంపీడీవోని ఆదేశించారు. అనంతరం పంచాయతీలకు సంబంధించిన వర్క్ ఆర్డర్స్‌ని ఎమ్మెల్యే చేతులమీదుగా సర్పంచ్‌లకు అందజేశారు. జడ్పీటీసీ సభ్యురాలు రత్నమ్మ, ఎంపీడీవో రామచంద్ర, అధికారులు పాల్గొన్నారు.

శోకసంద్రంలో ఎగువరాగిమాను పెంట

● అమర జవాన్ కార్తీక్‌కు నేడు అంతిమ సంస్కారాలు


గ్రామస్తుల నివాళులు

బంగారుపాళ్యం, జనవరి 21 (ఆంధ్ర జ్యోతి): ఉగ్రవాదుల కాల్పుల్లో తీవ్రంగా గాయపడి వీరమరణం పొందిన యువ జవాన్ కార్తీక్ యాదవ్‌కు నేడు స్వగ్రామమైన ఎగువరాగిమానుపెంటలో అధికార లాంఛనాల నడుమ అంత్యక్రియలు నిర్వహించనున్నారు.కార్తీక్ మృతి వార్తతో ఆయన కుటుంబ సభ్యులతో పాటు గ్రామస్తులంతా విషాదంలో మునిగిపోయారు.బంగారుపాళ్యం మండలం ఎగువరాగిమానుపెంట గ్రామానికి చెందిన వరదరాజులు,సెల్వి దంపతుల చిన్న కుమారుడు కార్తీక్ యాదవ్(29) పదేళ్ల క్రితం ఆర్మీలో చేరాడు.రాజస్థాన్ ఆర్మ్‌డ్ రెజిమెంట్‌లో ఏడేళ్ళ పాటు పని చేశాక రెండేళ్ళ క్రితం జమ్ముకు బదిలీ అయ్యారు.ఉగ్రవాదులను ఏరివేసే కూంబింగ్ రైఫిల్ విభాగంలో పనిచేస్తున్నారు.ఆదివారం జమ్మూకాశ్మీర్‌లో ఉగ్రవాదులతో జరిగిన భీకరపోరులో కార్తీక్ తీవ్రంగా గాయపడ్డాడు. ఆర్మీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మరణించాడు. ఈ సమాచారాన్ని ఆర్మీ అధికారులు ఫోన్ ద్వారా చెప్పడంతో కార్తీక్ తల్లిదండ్రులు తల్లడిల్లిపోయారు.శనివారం ఫోన్‌లో మాట్లాడుతూ శెలవుల్లో ఇంటికి వస్తానని చెప్పాడని,మరుసటి రోజే ఇలా జరిగిందంటూ కార్తీక్ తల్లి కన్నీరు మున్నీరైంది.కార్తీక్ అన్న రాజేష్ మాట్లాడుతూ తన తమ్ముడికి పెళ్లి సంబంధాలు కూడా చూస్తున్నామని ఇంతలో ఘోరం జరిగిపోయిందని ఏడుస్తూ చెప్పాడు.కాగా కార్తీక్‌యాదవ్‌కు బుధవారం స్వగ్రామంలో అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించనున్నారు. కార్తీక్ భౌతికకాయం బుధవారం ఉదయానికి ఎగువరాగిమానుపెంటకు తీసుకొచ్చేందుకు ఆర్మీ అధికారులు ఏర్పాట్లు చేశారు.అంత్యక్రియల ఏర్పాట్లను తహశీల్దార్ బాబూ రాజేంద్రప్రసాద్,ఆర్ఐ మధుసూదన్ పర్యవేక్షిస్తున్నారు. కాగా వీరజవాన్ కార్తీక్‌కు స్వగ్రామంలో మంగళవారం రాత్రి స్నేహితులు, గ్రామస్తులు ఘనంగా నివాళులర్పించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు.


రోదిస్తున్న కార్తీక్ తల్లి సెల్వి

ఎస్సీ వర్గీకరణపై వినతులను ప్రభుత్వానికి నివేదిస్తాం

● స్పష్టమైన సమాచారం ఇవ్వండి ● ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా



రంజన్‌మిశ్రాకు వినతిపత్రం ఇస్తున్న మాలమహానాడు, ఎమ్మార్పీఎస్ నాయకులు

చిత్తూరు అర్బన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ ఉప కులాల వర్గీకరణపై అందే వినతులను ప్రభుత్వానికి నివేదిస్తామని ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో ఎస్సీ ఉప కులాల వర్గీకరణపై కలెక్టర్ సుమిత్‌కుమార్‌తో కలిసి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నివేదికకు అవసరమైన ప్రభుత్వ ఉద్యోగుల వివరాలు, విద్య, రాజకీయ, ఉపాధి, హౌసింగ్, పోలీసు తదితర అంశాలపై కమిషన్ కోరిన మేరకు స్పష్టమైన సమాచారాన్ని అందించాలని కోరారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో రిజర్వుడు నియోజకవర్గాలుగా జీడీ నెల్లూరు, పూతలపట్టు ఉన్నాయన్నారు. ఎన్నికల తర్వాత డీవీఎంసీ కమిటీలను ఏర్పాటు చేసి సభ్యుల ద్వారా భూ సమస్యలు, ఉపాధి కల్పన తదితర అంశాలపై వినతులను స్వీకరించామన్నారు. అనంతరం దళిత సంఘాల నుంచి మిశ్రా వినతిపత్రాలను స్వీకరించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి మొత్తం 405 వినతులు అందాయని ఆయన తెలిపారు. ఎస్పీ మణికంత, తిరుపతి జేసీ శుభం బన్సల్, అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశీ, డీఆర్వో మోహన్ కుమార్, డీఎఫ్‌వో భరణి, ఏఎస్పీ రాజశేఖర్‌రాజు, జిల్లా అధికారులు, దళిత సంఘాల నేతలు పాల్గొన్నారు. అంతకుముందు ఆర్‌అండ్‌బీ అతిథి గృహానికి చేరుకున్న మిశ్రాకు జిల్లా అధికారులు ఘన స్వాగతం పలికారు.

ఎస్ఆర్‌పురంలో 'క్వారీ'లాట

శ్రీరంగరాజపురం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): శ్రీరంగరాజపురం మండలం ఆర్‌ఆర్‌పురం సమీపంలో సుమారు మూడు ఎకరాల గ్రానైట్ క్వారీ వివాదాలకు కేంద్రంగా మారింది. మంగళవారం ఆ క్వారీ తమదంటే తమదని వాగ్వాదాలు నడిచాయి. కొంత కాలంగా ఈ క్వారీలో చిత్తూరుకు చెందిన శేఖర్‌బాబు పనులు చేసుకుంటున్నారు. మంగళవారం తమిళనాడుకు చెందిన భానుప్రతాప్ అనే వ్యక్తి క్వారీ వద్దకు వచ్చి 'ఇది నా క్వారీ. వెంటనే పనులు నిలిపివేయండి' అంటూ ప్రెస్‌మీట్ పెట్టారు. అదే మండలం పిల్లిగుండ్లపల్లెకు చెందిన గుణశేఖర్‌నాయుడు కూడా అక్కడి వచ్చి.. 'ఇక్కడే ఆనుకుని మా భూమి కూడా ఉంది. సర్వే తర్వాత పనులు చేసుకోండి' అన్నారు. ముగ్గురి మధ్య వాదోపవాదాలు జరిగాయి. పోలీసులు కల్పించుకుని ముగ్గుర్నీ స్టేషన్‌కు పిలుచుకుని వెళ్లారు. సరైన రికార్డులు తెచ్చినవారు క్వారీ పనులు చేసుకోవాలని సూచించారు. తాత్కాలికంగా క్వారీలో పనుల్ని నిలిపేశారు.ఇదిలా ఉండగా, 2017లో భానుప్రతాప్ తండ్రి మణినాయుడు ఈ క్వారీకి ఎన్‌వోసీ తీసుకున్నట్లు తెలుస్తోంది. కరోనా సమయంలో మణినాయుడు మరణించగా.. 2019లో పెద్దఎత్తున ఫైన్ వేసి అధికారులు మూసేశారు. కొంత కాలంగా శేఖర్‌బాబు ఇక్కడ పనులు చేసుకుంటున్నారు. క్వారీ నుంచి గ్రానైట్ దిమ్మెలు తరలిస్తుండడంతో మంగళవారం భానుప్రతాప్ అడ్డుకున్నారు.

విశాఖ ఉక్కును కాపాడిన చంద్రబాబు

తిరుపతి(ఆటోనగర్)జనవరి21: విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరణ కాకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు మన హక్కుగా కాపాడారని తిరుపతి పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు జి.నరసింహయాదవ్, కార్పొరేటర్ ఆర్‌సీ మునిక్రిష్ణ పేర్కొన్నారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం వారు మీడియాతో మాట్లాడారు. ఆంధ్రులు ప్రాణత్యాగాలు చేసి విశాఖ ఉక్కును సాధించుకున్నారని తెలిపారు. అలాంటి కర్మాగారాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణ చేయాలని నిర్ణయించినా నాటి సీఎం జగన్ స్పందించక పోవడం శోచనీయమన్నారు. ఆయన తనపై వున్న కేసుల సమస్యలను పరిష్కరించుకోవడానికి హస్తిన పెద్దలతో మంతనాలు చేశారే గానీ రాష్ట్ర ప్రయోజనాల కోసం ఏరోజూ చర్చించలేదన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి కాగానే రాష్ట్ర అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్నారని వెల్లడించారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో విశాఖ స్టీల్ ప్లాంట్‌కు రూ11,440 కోట్లు మంజూరు చేయించారని వివరించారు. కార్మికులకు ఇచ్చిన హామీని చంద్రబాబు నిలబెట్టుకున్న విషయాన్ని వైసీపీ నాయకులు గుర్తించుకోవాలన్నారు. అనంతరం టీడీపీ నాయకులు శ్రీధర్ వర్మ, ఊట్ల సురేంద్రనాయుడు, పి.కుమారి మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి నాయకులు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, బీజేపీ అధ్యక్షులు పురందరేశ్వరిలు విశాఖ ఉక్కు సమస్య పరిష్కారానికి అందించిన సహకారం అభినందనీయమన్నారు. విశాఖ స్టీల్ సమస్యను పరిష్కరించడానికి సహకరించిన ప్రధాని నరేంద్ర మోదీకి, కేంద్ర మంత్రులకు వారు ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు కరాటే చంద్ర, వేణుగోపాల్, సుబ్బుయాదవ్, శ్రీనివాసులు, శ్రీరాములు, శంకర్‌లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నరసింహయాదవ్

క్రైం డీఎస్పీగా శ్యాంసుందర్ బాధ్యతల స్వీకరణ



తిరుపతి(నేరవిభాగం), జనవరి 21(ఆంధ్రజ్యోతి): తిరుపతి క్రైమ్ డీఎస్పీగా శ్యాంసుందర్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ డీఎస్పీగా పనిచేసిన రాంకుమార్‌ను ప్రభుత్వం పది రోజుల కిందట సస్పెండు చేసిన విషయం తెలిసిందే. దీంతో ఆయన స్థానంలో రాజమహేంద్రవరంలోని మహిళా పోలీసు స్టేషన్‌లో డీఎస్పీగా పనిచేస్తున్న శ్యాంసుందర్‌ను నియమించారు. దీంతో ఆయన బాధ్యతలు స్వీకరించారు.

పట్టించుకోండి సారూ...!

వెలగని వీధిలైట్లు


కులశేఖర ఆళ్వార్ మార్గంలో వెలగని విద్యుత్ బల్బులు

తిరుపతి అర్బన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మాస్టర్‌ప్లాన్ రోడ్లలో భాగంగా స్థానిక కులశేఖర ఆళ్వార్ మార్గంలో నెలరోజులుగా ఒక వైపు వీధిలైట్లు వెలగడంలేదు. దాదాపు పాతిక లైట్లు ఆన్ కావడంలేదు. దీంతో రోడ్డంతా అంధకారం నెలకొంది. రాత్రివేళలలో కూలీలు బిక్కుబిక్కుమంటూ నడిచి వెళ్తున్నారు. ఉషోదయంలో వాకింగ్ చేస్తున్నవారికి ఇదే సమస్య ఎదురవుతోంది. అనతికాలంలో బల్బులు పాడవడమేంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. సంబంధిత విభాగానికి పిర్యాదు చేసినా పట్టించుకోలేదని విమర్శలున్నాయి. వెంటనే విద్యుత్ బల్బులు వెలిగేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ


బాధితులకు సీఎంఆర్ చెక్కుల పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆరణి

తిరుపతి అర్బన్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అందించారు. మంగళవారం ఉదయం ఆయన తన నివాసంలో సుజాత (మారుతీనగర్, కొర్లగుంట), జయచంద్ర (నిమ్మకాయల వీధి), ఇగ్నరెహమత్(బాలాజీ వీధి)లకు చెక్కులు అందజేశారు. ఎమ్మెల్యేకు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలియజేశారు. కూటమి నాయకులు పులిగోరు మురళీకృష్ణారెడ్డి, రాజారెడ్డి, మహేష్ యాదవ్, కేఎంకే.లోకేశ్, బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 70 మంది ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో అధ్యాపకులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) జనవరి 21 (ఆంధ్రజ్యోతి): పద్మావతి డిగ్రీ కాలేజీలో చేపట్టిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 70 మంది డిగ్రీ ఫైనలియర్ విద్యార్థులు ఎంపికయ్యారు. ఢిల్లీకి చెందిన ఎస్‌ఐబీటీ సంస్థ నేతృత్వంలో పలు సంస్థలు ఈ మేళాలో పాల్గొన్నాయి. పలు సంస్థలకు నిర్వహించిన ప్రతిభా పరీక్షల్లో 120 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో 70 మంది ఎంపికయ్యారు. వీరిని ప్రిన్సిపాల్ నారాయణమ్మ, వైస్ ప్రిన్సిపాల్ భద్రమణి, అధ్యాపకులు అభినందించారు.

ఒలంపియాడ్‌లో శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులతో ప్రిన్సిపాల్ జయప్రకాశ్, వైస్‌ప్రిన్సిపాల్ కిశోర్‌బాబు తదితరులు

తిరుపతి(గాంధీరోడ్డు), జనవరి21(ఆంధ్రజ్యోతి): జీఎస్ మాడ వీధిలోని శ్రీచైతన్య పాఠశాలలో చదివే విద్యార్థులు జాతీయ ఒలంపియాడ్ నాలెడ్జ్ అసెస్‌మెంట్ పరీక్షల్లో ప్రతిభచాటి బహుమతులు సాధించారని ప్రిన్సిపాల్ జయప్రకాశ్ పేర్కొన్నారు. 8 మంది విద్యార్థులు మంచి ప్రతిభచాటి నగదు బహుమతి, సర్టిఫికెట్లు సాధించారన్నారు. 6వతరగతి విద్యార్థి వై.చారుహాసిని ప్రథమస్థానం సాధించిందని వివరించారు. ఏజీఎం సురేష్ విద్యార్థులను అభినందించారు. వైస్‌ప్రిన్సిపాల్ కిశోర్‌బాబు, అకడమిక్ కో-ఆర్డినేటర్ బాలాజి, జోనల్ అకడమిక్ డీన్ సురేష్, సీఅండ్ఎం ఇన్‌చార్జి నరేంద్రబాబు, టీచర్లు పాల్గొన్నారు.

ఢిల్లీలో మెరిసిన తిరుపతి ఎన్‌సీసీ క్యాడెట్లు


మెడల్స్ స్వీకరిస్తున్న ఎన్‌సీసీ క్యాడెట్లు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో నిర్వహించిన రిపబ్లిక్ డే క్యాంప్‌లో తిరుపతి ఎన్‌సీసీ క్యాడెట్లు అద్భుత ప్రతిభను ప్రదర్శించారు. దీంతో వీరికి పలు పతకాలు వరించాయి. డ్రెస్సేజ్ ఈవెంట్‌లో లోకేష్ అనే క్యాడెట్ బంగారు పతకం, టెన్త్ పెగ్గింగ్‌లో రజత పతకం సాధించాడు. మహిమరాజు అనే క్యాడెట్ డ్రెస్సేజ్ ఈవెంట్‌లో రజతం, కాంస్య పతకాలు పొందారు. అంజలి అనే క్యాడెట్ సిక్స్ బార్ జంపింగ్ ఈవెంట్‌లో ట్రోఫీ, డ్రెస్సేజ్‌లో కాంస్య పతకాన్ని సాధించారు. ఇలా బెస్ట్ రైడర్స్ బాయ్స్ ట్రోఫీని కూడా వీరు సాధించారు. వీరిని తిరుపతి ఎన్‌సీసీ గ్రూప్ అధికారులు, సిబ్బంది అభినందించారు. మంచి శిక్షణ, క్రమశిక్షణతోనే ఈ గుర్తింపు సాధ్యమైందని వారు అన్నారు.

హత్య కేసులో నిందితుడికి యావజ్జీవ జైలు శిక్ష

● రూ.5000 జరిమానా

తిరుపతి(నేరవిభాగం), జనవరి 21(ఆంధ్రజ్యోతి): తిరుపతి ఈస్ట్ స్టేషన్ పరిధిలో నాలుగేళ్ల కిందట జరిగిన హత్యకు సంబంధించి నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ మంగళవారం ఐదవ అదనపు జిల్లా న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ఈస్ట్ సీఐ రామకృష్ణ తెలిపిన ప్రకారం.. లక్ష్మీపురానికి చెందిన శంకర్, అదే ప్రాంతానికి చెందిన భరత్ మధ్య కొన్నేళ్ళుగా మనస్పర్థలున్నాయి. ఈ క్రమంలో 2020 నవంబరు 29న భరత్‌ను శంకర్ తీవ్రంగా కొట్టాడు. ఈ విషయం తెలిసిన భరత్ కుటుంబ సభ్యులు అతడిని ప్రశ్నించగా.. తీవ్ర ఆగ్రహానికి గురైన శంకర్ ఇంట్లోకి వెళ్ళి కత్తి తీసుకొచ్చి భరత్‌పై దాడి చేశాడు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన భరత్‌ను కుటుంబ సభ్యులు రుయాస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ మరుసటి రోజు భరత్ మృతి చెందాడు. అప్పటి ఈస్ట్ సీఐ శివప్రసాద్ రెడ్డి సాక్షులను విచారించి నిందితుడైన శంకర్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. హత్యకు ఉపయోగించిన కత్తిని సీజ్ చేశారు. కేసు విచారణ నిమిత్తం కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. దీనిపై ఇరువర్గాల వాదనలు విన్న న్యాయమూర్తి నిందితుడైన శంకర్‌కు యావజ్జీవ కారాగార శిక్ష, రూ.5000 జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పు చెప్పారు.

కిడ్నాప్‌చేసి కొట్టారు

● ఆపై వదిలేశారంటూ బాధితుడి ఫిర్యాదు

తిరుపతి(నేరవిభాగం), జనవరి 21(ఆంధ్రజ్యోతి): తిరుపతి కొర్లగుంట సమీపంలోని గురవారెడ్డి సమాధి సమీపంలో సోమవారం అర్ధరాత్రి ఓ యువకుడిని కిడ్నాప్ చేశారు. అతడిని కొట్టి వదిలేశారు. దీనిపై బాధితుడు షేక్ ఇబ్రహీం మంగళవారం ఈస్ట్ పోలీసులకు పిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. ఈస్ట్ ఎస్‌ఐ బాలకృష్ణ తెలిపిన ప్రకారం.. తిరుపతికి చెందిన నవీన్ వద్ద గతంలో ఇబ్రహీం డ్రైవర్‌గా పనిచేశారు. కొద్ది రోజులకు మానేసి.. సొంతంగా కారు నడుపుకొంటున్నారు. దీంతో ఇతడిపై నవీన్‌కు కక్ష పెరిగింది. ఈ క్రమంలో నవీన్‌తో పాటు మరో ముగ్గురు కలిసి ఆదివారం రాత్రి షేక్ ఇబ్రహీంను కారులో బలవంతంగా ఆటోనగర్‌కు తీసుకెళ్లారు. కాళ్లు, చేతులు కట్టేసి కొట్టారు. ఆ తర్వాత అదే కారులో అతడిని కొరమేనుగుంటకు తీసుకెళ్లి వదిలేశారు. ఈ మేరకు మంగళవారం బాధితుడు ఇచ్చిన పిర్యాదు మేరకు ఈస్ట్ ఎస్‌ఐ కేసు నమోదు చేశారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరా : ఎస్ఈ


ఏడీఈ, ఏఈఈలతో సమీక్షిస్తున్న ఎస్ఈ సురేంద్రనాయుడు

తిరుపతి(ఆటోనగర్), జనవరి21 (ఆంధ్రజ్యోతి): తిరుపతి పట్టణ డివిజన్ పరిధిలో రానున్న వేసవి కాలంలో వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు ప్రణాళికలతో ముందుకు సాగాలని తిరుపతి సర్కిల్ ఎస్ఈ సురేంద్రనాయుడు ఆదేశించారు. స్థానిక పాత తిరుచానూరు రోడ్డులోని విద్యుత్ డీఈ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం డివిజన్ పరిధిలోని ఏఈలు, ఏడీఈలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న వేసవి కాలంలో విద్యుత్ వినియోగం పెరుగుతుందని, అందుకు అనుగుణంగా ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంచుకోవాలని సూచించారు. పెరుగుతున్న విద్యుత్ వినియోగాన్ని గుర్తించి అందుకు సంబంధించిన ప్రణాళికలను ఏఈలు, ఏడీలు రూపొందించాలని ఆదేశించారు. నిరంతర విద్యుత్ సరఫరాకు ఆటంకాలు కలగకుండా ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు అవసరమైన, అనువైన ప్రాంతాలు గుర్తించాలని ఆదేశించారు. ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు చేస్తామని తెలిపారు. సోలార్ విద్యుత్ కనెక్షన్ల ఏర్పాటుపై ప్రజల్లో అవగాహన పెంచాలని సూచించారు. ఈఈ చంద్రశేఖరరావు, టెక్నికల్ ఈఈ వాసవీలత, డీఈ ఈఈలు అంజనేయులు, మునిప్రసాద్, జయప్రకాష్, ఏఈలు పాల్గొన్నారు.

బ్రాహ్మణుల అభివృద్ధికి ప్రభుత్వ కృషి


బ్రాహ్మణులకు రుణాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆరణి

తిరుపతి అర్బన్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం బ్రాహ్మణులకు విశేషంగా రుణాలు మంజూరుచేసి వారి అభివృద్ధికి తోడ్పాటును అందిస్తోందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం ఆయన తన నివాసం వద్ద ఏపీ బ్రాహ్మణ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ద్వారా అర్హులైన లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేశారు. మొత్తం 20కుటుంబాలకు రూ.32.65లక్షల రుణాలకు సంబంధించిన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాలు, కులాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తోందని గుర్తు చేశారు. అనంతరం టీడీపీ బ్రాహ్మణ రాష్ట్ర సాధికార సభ్యులు చిత్రపు హనుమంతరావు ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. అలాగే వెంకటగాయత్రి బ్రాహ్మణ సేవాసమితి తరపున ఫిబ్రవరి 2న స్థానిక కంచి మహాపాదుక మండపంలో నిర్వహించే వివాహ పరిచయ వేదికకు ముఖ్యఅతిథిగా విచ్చేయాలని ఎమ్మెల్యేను ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకురాలు జయలక్ష్మి, అప్పలాయగుంట ఆలయ నిర్వాహకురాలు కిడాంబి లక్ష్మీరంగనాథన్, అపర్ణ, పీఎల్ఆర్.కుమార్, లీలావతి పాల్గొన్నారు.

పెట్టుబడిదారీ వ్యవస్థపై తిరుగుబావుటా ఎగరేసిన లెనిన్


ప్రసంగిస్తున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు రమాదేవి

తిరుపతి(ఆటోనగర్), జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలో పెట్టుబడిదారీ వ్యవస్థపై తిరుగుబాటు చేసి సోషలిస్టు విప్లవానికి నాంది పలికిన విప్లవ జ్యోతి లెనిన్ అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు రమాదేవి కీర్తించారు. మంగళవారం యశోదానగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో 'పెట్టుబడి - ప్రజాస్వామ్యం' అనే అంశంపై సదస్సు జరిగింది. తొలుత లెనిన్ చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. అనంతరం రమాదేవి మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నియంతృత్వ పాలన చేస్తూ ప్రజల హక్కుల హరిస్తోందన్నారు. మోదీ పెట్టుబడిదారుల విధానాలకు అనుగుణంగా పాలన సాగిస్తున్నారని మండిపడ్డారు. దేశంలో నడుస్తున్న పెట్టుబడిదారుల పాలనను అంతం చేయడానికి కార్మిక, కర్షక, శ్రామిక వర్గాల ప్రజలు ఏకమై ఐక్యపోరాటాలు చేయడానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో వి.నాగరాజు, కందారపు మురళి, పుల్లయ్య, జనార్ధన్, సుబ్రమణ్యం, డాక్టర్ పి.సాయిలక్ష్మి పాల్గొన్నారు.

●సీపీఐ కార్యాలయంలో..

స్థానిక బైరాగిపట్టెడలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో లెనిన్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. లెనిన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పి.మురళి, చలపతి, రామచంద్రయ్య, శ్రీరాములు, శివ, గోవిందస్వామి, రామకృష్ణ, బాషా, పురుషోత్తంరెడ్డి పాల్గొన్నారు.

భవితకేంద్రం విద్యార్థికి కలెక్టర్ ఆపన్న హస్తం

బ్యాటరీ మోటారు సైకిల్, నగదు పురస్కారం


కలెక్టర్ నుంచి ట్యాబ్ అందుకుంటున్న విద్యార్థి రమేష్

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 21(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని మహాత్మాగాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాల భవిత కేంద్రంలో విభిన్న ప్రతిభావంతుడు వడ్లమూడి రమేష్‌కు కలెక్టర్ ఆపన్న హస్తం అందించారు. రమేష్ భవిత కేంద్రంలో 4వ తరగతి నుంచి చదువుతున్నాడు. ప్రస్తుతం ఇంటర్ మొదటి సంవత్సరం సీఈసీ చదువుతున్నాడు. సమగ్ర శిక్ష సహిత విద్య ఉపాధ్యాయులు భవాని సవరణాత్మక బోధన పద్ధతి ద్వారా చదవడం, రాయించడం నేర్పారు. సెరిబ్రల్ పాలసీతో ఇబ్బంది పడుతున్న రమేష్ రాష్ట్రంలో పలు క్విజ్ పోటీల్లో పాల్గొని అనేక బహుమతులు కైవసం చేసుకున్నాడు. ఇటీవల రాష్ట్రంలో క్విజ్ పోటీల్లో హైదరాబాద్ ప్రిలిమ్స్‌లో రూ.10వేల నగదు బహుమతి పొందాడు. అదేవిధంగా బెంగళూరులో జాతీయ స్థాయి పోటీల్లో మొదటి బహుమతి సాధించాడు. ఈ నేపథ్యంలో మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటేశ్వర్‌ను అతడు కలిశారు. విద్యార్థిని కలెక్టర్ అభినందించి కొత్త ట్యాబ్‌ను అందజేశారు. అదేవిధంగా తన సొంత నిధుల నుంచి రూ.50వేలు విలువ కలిగిన బ్యాటరీ మోటారు సైకిల్, రూ.10వేలు నగదు బహుమతిని ప్రకటించారు. అలాగే డీఈవో కేవీఎన్ కుమార్ రూ.5వేలు, జిల్లా సహిత విద్య సమన్వయకర్త చంద్రశేఖర్‌రెడ్డి రూ.5వేలు నగదు బహుమతిని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఉపవిద్యాశాఖాధికారి బాలాజీ, టీచర్ భవాని, జ్ఞానమ్మ, విద్యార్థి తల్లి కోటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.


ఫుట్‌పాత్ ఆక్రమణలపై కొరడా


ఫుట్‌పాత్‌ల ఆక్రమణలను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

తిరుపతి, జనవరి21 (ఆంధ్రజ్యోతి): ఫుట్‌పాత్ ఆక్రమణలపై తిరుపతి నగరపాలక సంస్థ కొరడా ఝుళిపిస్తోంది. నడిచివెళ్లేందుకు స్థలం లేకుండా అడ్డగోలుగా బంకులు పెట్టేసి పాదచారులకు కలుగుతున్న ఇబ్బందులపై పెద్దఎత్తున పిర్యాదులు రావడంతో వాటిని తొలగించేందుకు కార్పొరేషన్ యంత్రాంగం సమాయత్తమైంది. ఇందులో భాగంగా మంగళవారం తిరుమల బైపాస్ రోడ్డులోని మున్సిపల్ పార్కు పక్కన ఫుట్‌పాత్‌పై వెలిసిన తాత్కాలిక షెడ్లు, దుకాణాలను తొలగించారు. ఆక్రమణల తొలగింపును అడ్డుకునేందుకు పలువురు వామపక్ష నాయకులు రావడంతో నగరంలో ఫుట్‌పాత్‌ల ఆక్రమణలను దశలవారీగా తొలగిస్తున్నామని కార్పొరేషన్ సిబ్బంది వివరించారు. ఆక్రమణదారులకు ఇదివరకే నోటీసులు ఇచ్చామని, వారు తొలగించకపోవడంతో చర్యలకు ఉపక్రమించినట్లు తెలియజేశారు.

భూసేకరణ వేగవంతం చేయండి

సీఎస్ విజయానంద్


వీడియో కాన్ఫరెన్సుకు హాజరైన కలెక్టర్ తదితరులు

తిరుపతి(కలెక్టరేట్), జనవరి21(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రహదారులు విస్తరణకు అవసరమైన భూసేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా అధికారులను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఆదేశించారు. మంగళవారం విజయవాడ నుంచి వివిధ అంశాలపై జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భూసేకరణకు సంబంధించిన నిబంధనల ప్రకారం రైతులకు నష్టపరిహారం చెల్లించి సకాలంలో భూసేకరణ ప్రక్రియ పూర్తి చేసి ఆయా నిర్మాణ సంస్థలకు అందించాలని స్పష్టం చేశారు. అన్ని శాఖల సమన్వయంతో భూసేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. రహదారుల విస్తరణకు అవసరమైన భూసేకరణను అటవీ అనుమతులపై సమీక్షించారు. తిరుపతి జిల్లాలో జాతీయ రహదారుల నిర్మాణంపై జిల్లా అధికారుల నుంచి సమాచారం అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంకటేశ్వర్, జేసీ శుభం బన్సల్ పాల్గొన్నారు.

రైతుల పురోభివృద్ధికి కృషి

ఇన్‌చార్జి వీసీ జేవీ రమణ


జ్యోతిని వెలిగిస్తున్న ఇన్‌చార్జి వీసీ జేవీరమణ తదితరులు

తిరుపతి రూరల్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): రైతుల పురోభివృద్ధికి వెటర్నరీ వర్సిటీ అండగా నిలచి సేవలందిస్తోందని ఇన్‌చార్జి వీసీ జేవీరమణ తెలిపారు. వర్సిటీలోని నిరంతర పశువైద్య, విద్య, సమాచార కేంద్రం ఆధ్వర్యంలో శాస్త్రీయ పద్ధతుల్లో గొర్రెలు, మేకల పెంపకం అనే అంశంపై నిర్వహించిన మూడ్రోజుల నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. వర్సిటీ పరిధిలోని పరిశోధనాస్థానాల్లో మేలైన గొర్రెలు, మేకలను అభివృద్ధి చేసి రైతులకు అందిస్తున్నామని వివరించారు. సమతుల్య ఆహారాన్ని అందించి వ్యాపారసరళిలో అభివృద్ధి సాధించాలని తెలిపారు. శిక్షణలో భాగంగా కాగా గొర్రెల, మేకల పెంపకానికి అనువైన శాస్త్రీయ పరిజ్ఞానం, విలువ ఆధారిత మాంస ఉత్పత్తుల తయారీపై పలువురు శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. డైరెక్టర్ ఆఫ్ ఎక్స్‌టెన్షన్ డాక్టర్ శోభామణి, సీసీవీఈసీ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ డాక్టర్ కె.సుజాత, ప్రొఫెసర్ డాక్టర్ జి.గంగరాజు, డాక్టర్ పి.మాధురి పాల్గొన్నారు.

నారా లోకేశ్ పుట్టినరోజున మెగా రక్తదాన శిబిరం

ఎస్వీయూలో తెలుగు యువత, టీఎన్ఎస్ఎఫ్ ఏర్పాట్లు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 21 (ఆంధ్రజ్యోతి): విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ పుట్టిన రోజు సందర్భంగా 23వ తేదీన ఎస్వీ యూనివర్శిటీలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేయనున్నారు. తెలుగు యువత, టీఎన్ఎస్ఎఫ్ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నాయి. నారా లోకేశ్ అభిమానులు, యువత, విద్యార్థులు స్వచ్ఛందంగా తరలి వచ్చి రక్తదానం చేయాలని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల ఆనంద్ గౌడ్ కోరారు. పూర్తి వివరాలకు 7306911111 నెంబరులో సంప్రదించాలని ఆయన కోరారు.

రేపు ఎర్రావారిపాళెం మండల సమావేశం

ఎర్రావారిపాళెం, జనవరి 21(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని స్త్రీ శక్తి భవన్‌లో ఈనెల 23వ తేదీ గురువారం ఉదయం 11 గంటలకు ఎర్రావారిపాళెం మండల సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీవో అరుణ తెలిపారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే పులివర్తి నాని హాజరవుతారని, మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు, కోఆప్షన్ సభ్యులు, అన్ని శాఖల అధికారులు తప్పక హాజరు కావాలని కోరారు.

తిరుపతిలో వీకార్డ్ బిజినెస్

తిరుపతి(లీలామహల్), జనవరి21(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో టెక్నాలజీ అభివృద్ధికి వీకార్డ్ బిజినెస్ గొప్ప మైలురాయి అని బీఎన్ఐ చాంపియన్స్ ప్రెసిడెంట్ వంశీకృష్ణ అన్నారు. మంగళవారం పట్టణంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో ఎపిక్స్ మీడియా సంస్థ ఆధ్వర్యంలో రూపొందించిన వీకార్డ్ బిజినెస్ డిజిటల్ వ్యాపార కార్డు ప్లాట్ ఫారమ్‌ను బీఎన్ఐ తిరుపతి చాంపియన్స్ సమావేశంలో ఘనంగా ఆవిష్కరించారు. ఎపిక్స్ మీడియా మేనేజింగ్ డైరెక్టర్ ప్రవీణ్‌కృష్ణ, శశాంత్, స్వాతి, కార్తీక్‌రెడ్డి, మహేష్ పాల్గొన్నారు.

అన్నమయ్య కీర్తనలను పరిష్కరించిన పండితుడు

గౌరిపెద్ది వర్ధంతి సభలో అవధాని ఆముదాల మురళి


గౌరిపెద్ది రామసుబ్బశర్మ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న దృశ్యం

తిరుపతి(విశ్వవిద్యాలయాలు) జనవరి 21 (ఆంధ్రజ్యోతి): పదకవితా పితామహుడు అన్నమాచార్యుల వారి సంకీర్తనలను పరిష్కరించిన పండితుడు గౌరిపెద్ది రామసుబ్బశర్మ అని అవధాని ఆముదాల మురళి పేర్కొన్నారు. గౌరిపెద్ది 34వ వర్ధంతి కార్యక్రమం మంగళవారం తిరుపతిలో నిర్వహించారు. తొలుత గౌరిపెద్ది విగ్రహానికి పుష్పాంజలి ఘటించి నివాళి అర్పించారు. అన్నమాచార్య కళామందిరంలో చేపట్టిన సభలో ఆముదాల మురళి మాట్లాడుతూ అద్భుత సాహిత్య కృషిచేసిన వారిలో గౌరిపెద్ది ఒకరని కొనియాడారు. అన్నమయ్య సంకీర్తనలు ఇరవై ఏడు సంపుటాలు వెలువరించడం వెనుక గౌరిపెద్ది విశేషకృషి ఉందని గుర్తుచేశారు. మహా భారతం, భాగవతం, పురాణ, ఇతిహాసాలను అందించడంలోనూ గౌరిపెద్ది కృషిచేశారని తెలిపారు. అవధాని భరత్‌శర్మ మాట్లాడుతూ గౌరిపెద్ది సాహితీ శిఖరమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అన్నమాచార్య ప్రాజెక్టు డైరెక్టర్ రాజగోపాలరావు, గౌరిపెద్ది వెంకటభగవాన్, ప్రోగ్రాం అసిస్టెంట్ కోకిల, అధికారులు, సిబ్బంది, సాహిత్యాభిమానులు పాల్గొన్నారు.

ఎస్వీయూలో చిరుత!

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీలోని హెచ్-బ్లాక్ హాస్టల్ సమీపంలో మంగళవారం రాత్రి చిరుత సంచరించినట్లు తెలిసింది. దీంతో భయాందోళన నెలకొంది. ఇప్పటికే విద్యార్థులు, ఉద్యోగులను అధికారులు అప్రమత్తం చేశారు. చిరుత సంచారం నేపథ్యంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. రాత్రి 7 నుంచీ ఉదయం 7 గంటల మధ్య విద్యార్థులు, ఉద్యోగులు సంచరించకూడదని సూచించారు. వర్సిటీలో ఎక్కువగా ఉన్న కుక్కల కోసం చిరుత వస్తున్నట్లు ఫారెస్టు అధికారులు తెలిపారు. అందుకని కుక్కలు పట్టించేలా వర్సిటీ అధికారులు చర్యలు చేపట్టాల్సి ఉంది.

డాడీతో సినిమాకి టైం ఉంది | ● హీరో ఆకాష్ పూరి



తిరుమల, జనవరి21(ఆంధ్రజ్యోతి): తన తండ్రి పూరి జగన్నాథ్‌తో సినిమా చేయడానికి ఇంకా టైం ఉందని హీరో ఆకాష్ పూరి తెలిపారు. తిరుమల శ్రీవారిని మంగళవారం దర్శించుకున్న ఆయన మీడియాతో మాట్లాడుతూ, చాలా రోజుల తర్వాత అద్భుతమైన శ్రీవారి దర్శనం లభించిందన్నారు. త్వరలో 'తల్వార్' సినిమా చేయబోతున్నట్లు తెలిపారు. ఈ సినిమా షూటింగ్ జనవరి నెలాఖరులో ప్రారంభమవుతుందన్నారు. అందుకే స్వామి ఆశీస్సుల కోసం తిరుమలకు వచ్చానన్నారు. ఇక, తన తండ్రి దర్శకుడు పూరి జగన్నాథ్ ఓ కథ రాస్తున్నారని, ఎవరు హీరో అనేది ఇంకా ఫిక్స్ కాలేదని ఓ ప్రశ్నకు బదులిచ్చారు.

శ్రీవారి సేవలో గాయని మంగ్లీ

తిరుమల, జనవరి21 (ఆంధ్రజ్యోతి):గాయని మంగ్లీ మంగళవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీతో కలిసి ఆమె మంగళవారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లి శ్రీవారిని దర్శించుకున్నారు.



విజయశ్రీ, మంగ్లీ

సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని 2 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 3 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

ఆదివారం నాటి హుండీ ఆదాయం : రూ.3.59 కోట్లు

సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 83,806

తలనీలాలు సమర్పించినవారు: 23,352



ప్రచారం లేకున్నా... పక్షుల పండుగ సూపర్ హిట్!

అన్నీ తానై వ్యవహరించిన జిల్లా కలెక్టర్

స్థానిక ఎమ్మెల్యేతో సమన్వయం





తడ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): సమయం లేదు... ప్రచారం అంతకన్నా లేదు... మధ్యలో కొన్ని ఆటంకాలు... అయినా ఇంతపెద్ద పండుగను విజయవంతం చేయగలిగారు అధికారులు. ఉమ్మడి నెల్లూరుజిల్లాలో 2001లో ప్రారంభమైన పక్షుల పండుగను 2020 దాక నిర్వహించారు. జగన్ ప్రభుత్వం ఒక ఏడాది మొక్కుబడిగా నిర్వహించి నాలుగేళ్లు చేతులెత్తేసింది. టీడీపీ అధికారంలోకి వచ్చిన ఆరు నెలలకే మళ్లీ పక్షుల పండుగను ఘనంగా నిర్వహించాలనే నిర్ణయం తీసుకుంది. తిరుపతి జిల్లా ఏర్పడ్డాక తొలిసారి ఈ పండుగ నిర్వహణకు అధికార యంత్రాంగం సిద్ధపడింది. ఏర్పాట్లు మొదలయ్యే సమయంలో వైకుంఠ ఏకాదశి టోకెన్ల క్యూలో తొక్కిసలాట సంఘటన కుదిపేసింది. జిల్లా అధికారులంతా దానిమీద దృష్టి పెట్టాల్సివచ్చింది. ఈలోగా సంక్రాంతి పండుగ దినాలు వచ్చేశాయి. పాఠశాలలకు సెలవులు కావడంతో విద్యార్థులు పండుగకు రారనే అనుమానం ఏర్పడింది. పక్షుల పండుగ తేదీలను అప్పటికే మార్చినందున మరోసారి మార్చేందుకు సిద్ధపడలేదు. జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ ఆధ్వర్యంలోని అధికారుల బృందం ఉన్న అతి కొద్దిరోజులలోనే రాత్రి, పగలు తేడా లేకుండా పక్షుల పండుగ ఏర్పాట్లను పూర్తిచేయడం విశేషం. ఈ హడావుడిలో ప్రచారం కూడా పెద్దగా చేయలేకపోయారు. తొలిరోజు సమావేశానికి మంత్రి కందుల దుర్గేష్ హాజరయ్యారు. సమావేశం జనం లేక వెలవెలబోయింది.రాజకీయ ప్రత్యర్థులు అధికార కూటమిపై విఫలం అంటూ విమర్శల దాడి మొదలు పెట్టారు. వీరికి తోడు వాన కూడా కురిసి ప్రధాన ప్రాంగణం బురదమయం అయ్యింది.



అటకానితిప్ప వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ (ఫైల్ ఫొటో)

అయినా అధికార యంత్రాంగం వెనకడుగు వేయలేదు. ఆగమేఘాలపై మైదానం సిద్ధం చేశారు. ఆకట్టుకునేలా స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. దీంతో శనివారం మధ్యాహ్నం నుంచి తండోపతండాలుగా జనం రావడం మొదలుపెట్టారు. రెండవరోజు ఆదివారం కావడంతో కుటుంబాలతో సందర్శకులు పోటెత్తారు. నేలపట్టు, అటకానితిప్ప, సూళ్లూరుపేట, భీములవారిపాళెం పడవలరేవు ఉదయం నుంచే జనంతో కిటకిటలాడిపోయాయి. సాయంత్రానికి ఆ రద్దీ మూడింతలైంది. భద్రత దృష్ట్యా పడవకి పదిమందినే అనుమతించడం, అందరికీ లైఫ్ జాకెట్లు ఉండేలా శ్రద్ధ తీసుకోవడం, తాత్కాలిక ప్లాట్ ఫారాలు ఏర్పాటు చేసి నేరుగా పడవలోకి ఎక్కేలా చూడడం వంటి చర్యల వల్ల చిన్న సంఘటన కూడా జరగలేదు.

సాంస్కృతిక కార్యక్రమాలు హైలెట్

సాంస్కృతిక కార్యక్రమాలు ఈ ఏడాది విశేషంగా ఆకట్టుకున్నాయి. సినీ కళాకారులు రావడంతో జనం పెద్ద సంఖ్యలో మూడు రోజులూ వచ్చారు. సూళ్లూరుపేట కళాశాల మైదానంతోపాటు దాని చుట్టుపక్కల రోడ్లు అన్నీ కిటకిటలాడాయి. మూడవరోజున సోమవారం అర్థరాత్రి వరకు సాంస్కృతిక కార్యక్రమాలు జరిగినా జనం కదలకుండా తిలకించసాగారు.

పోలీసుల సేవలు భేష్

తిరుపతి దుర్ఘటన నేపథ్యంలో పోలీసులు తగిన ఏర్పాట్లు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలకు జనం పోటెత్తి వచ్చినా చిన్న సంఘటన కూడా జరగకుండా నియంత్రించారు. కళాశాల మెయిన్ గేట్ వద్ద ఆదివారం కొంత తోపులాట జరగడంతో అప్రమత్తమై నిమిషాలలోనే పరిస్థితి అదుపులోకి తీసుకువచ్చారు.

కలెక్టర్.. ఎమ్మెల్యే ఎనలేని కృషి

పండుగ విజయానికి జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీలు సమన్వయంతో కృషి చేశారు. ఎక్కడ సమస్య తలెత్తినా అప్పటికప్పుడు పరిష్కారదిశగా చర్యలు తీసుకున్నారు.

ఇవీ లోపాలు..

- ఇంత భారీ ఎత్తున జరిగిన కార్యక్రమాలకు అనేక ప్రాంతాల నుంచి జనం వస్తారని అంచనా ఉన్నా తగినన్ని బస్సులను ఏర్పాటు చేయలేకపోయారు.
- నేలపట్టులో, అటకానితిప్పలో వేదికలు ఏర్పాటు చేసినా ఆకట్టుకునే కార్యక్రమాలను నిర్వహించలేకపోయారు.
- బీవీపాలెం పడవల రేవులో పడవకు పది మందిని మాత్రమే అనుమతించడంతో జనం గంటలకు గంటలు ఎదురు చూడాల్సి వచ్చింది. ఇంకా ఎక్కువ పడవలను ఏర్పాటు చేసి ఉండాల్సింది.
- వివిధ ప్రాంతాల్లో ముందస్తు ప్రచారం జరగలేదు. కేవలం ఒక పత్రికలో చిన్న ప్రకటనతో సరిపెట్టుకున్నారు. సోషల్ మీడియాను కూడా తగినంతగా వినియోగించుకోలేదు.

నలుగురు స్మార్ట్ ఫోన్ దొంగల అరెస్టు

- 50 సెల్‌ఫోన్ల స్వాధీనం
- నిందితుల్లో బాలుడు
- బోస్టన్ స్కూల్‌కు తరలింపు



నిందితుల అరెస్టు చూపుతున్న పోలీసులు

శ్రీకాళహస్తి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): స్మార్ట్‌ఫోన్లను టార్గెట్‌గా చేసుకుని చోరీ చేసే బాలుడి సహా మరో ముగ్గురు యువకులను పోలీసులు అరెస్టు చేశారు. శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి తెలిపిన ప్రకారం.. కర్నూలు జిల్లా డోన్ పట్టణం శివరాంపేటకు చెందిన వెంకటసాయి(22) హైదరాబాద్‌లోని ఉప్పల్‌లో ఉంటూ కూలీ పనులు చేసుకునేవాడు. డోన్‌లోని శ్రీరామ్‌నగర్ ప్రాంతానికి చెందిన మురళి(37) కూడా హైదరాబాద్‌లో కీసరలో కూలీ పనులు చేస్తుంటాడు. అనంతపురం జిల్లా బుక్కరాయ సముద్రం మండలం ఎల్‌బీ కాలనీకి చెందిన సాయిశివ(29) ప్రైవేటు పనులు చేస్తుండేవాడు. ఈ ముగ్గురు కలిసి ఈజీమనీ కోసం స్మార్ట్‌ఫోన్లను చోరీ చేస్తుండేవారు. వీరికి హైదరాబాద్ నగరం ఎల్‌బీనగర్‌కు చెందిన 12 ఏళ్ల బాలుడు తోడయ్యాడు. ఈక్రమంలో శ్రీకాళహస్తి రెండో పట్టణ సీఐ వెంకటేశ్వర్లు సిబ్బందితో పట్టణ శివార్లలోని నంది కూడలి వద్ద మంగళవారం వాహన తనిఖీలు చేపట్టారు. పోలీసులను గమనించిన ఓ కారు వేగంగా వెళ్లిపోతుండగా అడ్డుకున్నారు. కారులోని వారిని అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పోలీసుల విచారణలో అంతర్రాష్ట్ర స్మార్ట్‌ఫోన్ దొంగలుగా తేలింది. వారి నుంచి 50 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. బాలుడిని బోస్టన్ స్కూల్‌కు తరలించారు. అనంతరం డీఎస్పీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి ముగ్గురు యువకుల అరెస్టు చూపారు. నిందితులను రిమాండుకు తరలించారు.

ఒకప్పుడు మన జిల్లా ఉద్యమాల ఖిల్లా!

భూస్వాముల హత్యలు.. నక్సల్స్ ఎన్‌కౌంటర్లతో అట్టుడికిన చరిత్ర

చలపతి ఎన్‌కౌంటర్‌తో జిల్లాలో ముగిసిన మావోయిస్టు అధ్యాయం



తిరుపతి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్, ఒడిశా సరిహద్దుల్లో మంగళవారం జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు రామచంద్రారెడ్డి అలియాస్ చలపతి మృతి చెందడంతో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో నక్సల్స్ పరంగా ఓ అధ్యాయం ముగిసినట్టయింది. జిల్లా నుంచీ మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీలో సభ్యుడుగా ఎదిగిన ఏకైక నక్సల్‌గా ఆయన గుర్తింపు పొందారు. నక్సల్ ఉద్యమంలో జిల్లాకు సంబంధించినంతవరకూ ఆయన చివరి వ్యక్తి. జిల్లా వామపక్ష తీవ్రవాద చరిత్రలో రామచంద్రారెడ్డి అలియాస్ చలపతి మరణంతో ఓ అధ్యాయం ముగిసినట్టయింది. 1970ల నుంచీ 2003 వరకూ సుమారు మూడు దశాబ్దాల పాటు జిల్లాలో రాడికల్, రైతు కూలీ సంఘం, నక్సల్ తదితర పేర్లతో మావోయిస్టు ఉద్యమం ఉధృతంగా సాగింది. ప్రస్తుత తరానికి పెద్దగా తెలియని ఆ ఉద్యమ కాలాన్ని అప్పటివారు చలపతి ఎన్‌కౌంటర్‌తో ఇప్పుడు గుర్తు చేసుకుంటున్నారు.

ఎస్వీయూలో పురుడు పోసుకున్న రాడికల్స్

ఉమ్మడి చిత్తూరు జిల్లాకు సంబంధించినంతవరకూ 1970వ దశకంలో రాడికల్ విద్యార్థి సంఘం పేరిట తీవ్రవాద వామపక్ష భావజాలమున్న ఉద్యమం మొదలైంది. తిరుపతిలోని ఎస్వీయూ నుంచీ ప్రారంభమైన ఈ విద్యార్థి సంఘం శాఖలు వేగంగా జిల్లా అంతటా వ్యాపించాయి. ముఖ్యంగా పడమటి ప్రాంతమైన మదనపల్లె, వాయల్పాడు, పీలేరు, తంబళ్లపల్లె, పుంగనూరు తదితర ప్రాంతాల్లో ఆర్‌ఎస్‌యూ బలంగా వేళ్లూనుకుంది. సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులు ఎక్కువగా ఈ సంఘం వైపు ఆకర్షితులయ్యారు. అలాగే సోమల, చౌడేపల్లె, కలికిరి ప్రాంతాల్లో మెజారిటీ దళిత వాడల యువకులు యూనియన్‌లో చేరి చురుగ్గా పనిచేశారు. ఓ దశలో మదనపల్లెలోని ప్రభుత్వ మోడల్ పాలిటెక్నిక్ ఆర్‌ఎస్‌యూకు కేంద్ర స్థానంగా మారింది. తరచూ రాడికల్ విద్యార్థులు, ఏబీవీపీ విద్యార్థుల నడుమ ఘర్షణలు తలెత్తేవి. ఆ నేపథ్యంలో ఇరువైపులా హత్యలు, ప్రతీకార హత్యలు కూడా జరిగాయి. కాగా రాడికల్ యూత్ లీగ్ పేరిట యువజన విభాగం కూడా చాలా చురుగ్గా పనిచేసింది. ఈ సంఘాల్లో జిల్లా నుంచీ పలువురు కీలక నేతలుగా ఎదిగారు. సూరిశెట్టి సుధాకర్ ఆర్‌ఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పనిచేసి అటు తర్వాత రాష్ట్ర కార్యదర్శిగా రెండు సార్లు వ్యవహరించారు. పోలీసులకు పట్టుబడి విడుదలయ్యాక 1980లలో ఉద్యమం నుంచీ వెలుపలికి వచ్చేశారు. తిరుపతి ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థి చంద్రశేఖర్ జిల్లా అధ్యక్షుడుగా పనిచేశారు. మల్లిక్ అనే నేత సైతం తిరుపతిలో కీలకంగా పనిచేశారు. ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థి ప్రభాకర్ 1990లలో ఎన్‌కౌంటర్‌లో మృతి చెందారు.

దళాలతో పీపుల్స్‌వార్

మావోయిస్టు పార్టీలో చీలక సంభవించి కొండపల్లి సీతారామయ్య వర్గం నుంచి వేరుపడి పీపుల్స్ వార్ గ్రూప్ ఏర్పాటు అయ్యింది. 1980,90 దశకాల్లో పీపుల్స్‌వార్ గ్రూపు కార్యకలాపాలు జిల్లాలో ఉధృతంగా సాగాయి. పాపాఘ్ని దళం, తలకోన దళం, కాళంగి దళం వంటి పేర్లతో నక్సల్స్ జోరుగా కార్యకలాపాలు నడిపారు.

- వాయల్పాడు పంచాయతీ సమితి మాజీ అధ్యక్షుడు చాకిరేవుపల్లి మల్‌రెడ్డిని కలికిరి క్రాస్ రోడ్డులో నక్సలైట్లు బాంబులు వేసి కొడవళ్ళతో దాడి చేసి చంపారు.
- వాయల్పాడు మండలం గొల్లపల్లిలో మజ్జిగ వెంకటేశు అనే మోతుబరి రైతుకు కాళ్ళు నరికేశారు.
- పెద్ద పంజాణి పోలీసు స్టేషన్‌పై నక్సలైట్లు దాడి చేసి తుపాకులు ఎత్తుకుని పరారైన ఘటన జిల్లాను కుదిపేసింది.
- వాయల్పాడు మండలం చింతపర్తి రైల్వే స్టేషన్‌ను డిటొనేటర్లు పెట్టి పేల్చేశారు.
- కలకడ మండలం కదిరాయచెరువులో టెలిఫోన్ ఎక్స్ఛేంజీని సైతం పేల్చేశారు.
- కంభంవారిపల్లి, ఎర్రావారిపాలెం మండలాల్లో ఎంతోమంది భూస్వాములు, మోతుబరి రైతుల ఇళ్ళు, ఆస్తులు పేల్చేశారు. ఎంతోమందిపై దాడులు చేశారు.

మరణించిన నక్సల్స్

- తంబళ్ళపల్లి మండలం డేగావారిపల్లికి చెందిన పీపుల్స్ వార్ నేత వేమనారాయణరెడ్డి అనంతపురం జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందారు.
- అదే మండలం దబ్బలగుట్టపల్లికి చెందిన నక్సలైట్ వెంకట్రమణారెడ్డి వరంగల్ జిల్లా ఎన్‌కౌంటర్‌లో చనిపోయారు.
- పెద్దమండ్యం మండలం కలిచెర్లకు చెందిన ఉమ్మడి జిల్లా పీపుల్స్ వార్ కార్యదర్శి మంగలి కృష్ణప్ప అలియాస్ రెడ్డెప్ప, ఆయన భార్య లక్ష్మి, ఆయన తమ్ముడు వెంకటస్వామి ముగ్గురూ కలకడ మండల సరిహద్దుల్లోని గుట్టపల్లి వద్ద 1995లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో హతమయ్యారు.
- ఐరాల మండలానికి చెందిన నక్సల్ నేత మహదేవరెడ్డి కూడా జిల్లాలోనే ఎన్‌కౌంటర్ అయ్యారు.
- శ్రీకాళహస్తి ప్రాంతానికి చెందిన భూపతి అలియాస్ వహార్కండేయులు నేతృత్వంలో చురుగ్గా పనిచేసిన కాళంగి దళం మొత్తం ఎన్‌కౌంటర్‌లో తుడిచిపెట్టుకుపోయింది. కాళంగి ప్రాజెక్టు సమీపంలోని అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఏడుగురు మృతి చెందారు.
- కంభంవారిపల్లి, ఎర్రావారిపాలెం మండలాల సరిహద్దుల్లోని శేషాచల అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో కూడా ఐదుగురు నక్సలైట్లు చనిపోయారు.
- పీలేరు శివార్లలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో అనంతపురం జిల్లా నక్సలైట్ నాయకుడు ఎర్ర శీను మృతి చెందారు.
- పెద్దమండ్యం మండలం కనమలోల్లపల్లి వద్ద చాకిబండ అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మహిళా నక్సలైట్ సహా నలుగురు చనిపోయారు.
- తిరుపతి ఎస్వీ ఆర్ట్స్ కాలేజీ విద్యార్థి చలపతి ఆర్మీకి ఎంపికై శిక్షణ మధ్యలో తిరిగి వచ్చేసి పీపుల్స్ వార్‌లో చేరారు. క్రమంగా యాక్షన్ కమిటీ సభ్యుడిగా ఎదిగారు. అరెస్టు అయి జైల్లోనే అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు.

అలిపిరి దాడితో అంతం

సీఎం చంద్రబాబుపై 2003 అక్టోబరులో అలిపిరి వద్ద నక్సలైట్లు క్లైమోర్ మైన్ పేల్చి హత్యాయత్నానికి పాల్పడడం దేశవ్యాప్తంగా సంచలనం రేపింది. ఆ దాడి నుంచీ చంద్రబాబు తృటిలో తప్పించుకున్నారు. ఆ ఘటనతో రాష్ట్ర వ్యాప్తంగా నక్సల్ కార్యకలాపాలపై నిర్బంధం తీవ్రతరమైంది. 2004లో ఏర్పడిన వైఎస్ ప్రభుత్వం సైతం అదే పంథా కొనసాగించడంతో క్రమంగా జిల్లాలో నక్సల్ కార్యకలాపాలు తగ్గుముఖం పడుతూ వచ్చి గత రెండు దశాబ్దాలుగా దాదాపు ఆగిపోయాయి.

పశ్చిమాన సంచలనం రైతు కూలీ ఉద్యమం

పీలేరు, మదనపల్లె, తంబళ్ళపల్లె, వాయల్పాడు, పుంగనూరు ప్రాంతాల్లో తలెత్తిన రైతు కూలీ సంఘం భూస్వాములను బెంబేలెత్తించింది. పలువురు భూస్వాములను రైతు కూలీ సంఘ ఉద్యమకారులు హతమార్చారు. ప్రతీకార దాడుల్లో పలువురు ఉద్యమకారులూ ప్రాణాలు పోగొట్టుకున్నారు.

- 1983 సెప్టెంబరులో మదనపల్లె సొసైటీ కాలనీలో తంబళ్లపల్లెకి చెందిన పోస్టాఫీసు రెడ్డెప్పరెడ్డిని ఉద్యమకారులు హత్య చేశారు. ఆయన అప్పట్లో పేరుమోసిన భూస్వాములైన టీఎన్ కుటుంబీకులకు అనుచరుడుగా వుండేవారు.
- 1984 డిసెంబరు 24న ములకలచెరువు మండలం చౌడసముద్రంలో భూస్వామి పుట్టా వెంకట్రమణను రైతు కూలీ సంఘం కార్యకర్తలు బస్సులోనే తుపాకులతో కాల్చి చంపారు. ఆయన రైతు కూలీ సంఘానికి వ్యతిరేకంగా భూస్వాములను ఏకం చేసి రైతు సంఘం పేరిట కార్యకలాపాలు సాగించిన వ్యక్తి.
- అదే రోజు అర్ధరాత్రి చౌడసముద్రం సమీపంలో ప్రతీకార దాడిలో మాజీ ఎమ్మెల్సీ ఏపీ ఉమాశంకర్‌రెడ్డి హత్యకు గురయ్యారు. ఆయన మాజీ ఎమ్మెల్యే ఏపీ లక్ష్మీదేవమ్మ భర్త.
- మదనపల్లె మల్లికార్జున థియేటర్ సమీపంలో తంబళ్ళపల్లి మండలం అన్నగారిపల్లికి చెందిన భూస్వామి నరసింహారెడ్డిని ఉద్యమకారులు బాంబులేసి కత్తులతో పొడిచి చంపారు.
- ములకలచెరువు మండలం చౌడసముద్రం పంచాయతీ రెడ్డెంవారిపల్లి సిద్దారెడ్డి కూడా ఇంటివద్దే ఉద్యమకారుల చేతుల్లో హత్యకు గురయ్యారు.
- ములకలచెరువు మండలం గుత్తావారిపల్లిలో భూస్వామి శివయ్య, అతని మరో ఇద్దరు సన్నిహితులు మొత్తం ముగ్గురు హత్యకు గురయ్యారు.
- దీనికి ప్రతీకారంగా రైతు కూలీ సంఘం నేత నాగిరెడ్డి బస్సు ఎక్కుతుండగా ప్రత్యర్థులు కత్తులతో నరికి చంపారు.
- తంబళ్ళపల్లి మండలం బురుజులో రైతుకూలీ సంఘం నాయకుడు రామిరెడ్డిని ప్రత్యర్థులు గొంతు కోసి చంపారు.
- తంబళ్ళపల్లి పోలీసు స్టేషన్ పక్కనే నివాసమున్న రైతు సంఘం నేత నూకల సుబ్బన్నను ఉద్యమకారులు ఆయన ఇంట్లోనే హత్య చేశారు.

25న సుభాష్ పాలేకర్ రాక



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ శాస్త్రవేత్త సుభాష్ పాలేకర్ శనివారం తిరుపతికి రానున్నారు. ఆయన పర్యటన వివరాలను ఎస్వీయూ వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు మంగళవారం మీడియాకు వెల్లడించారు. ఈనెల 25న ఎస్వీయూలోని శ్రీనివాసా ఆడిటోరియంలో వెయ్యి మంది విద్యార్థులకు.. 28న వెయ్యి మంది రైతులకు ప్రకృతి సేద్యంపై అవగాహన కల్పిస్తారని చెప్పారు. ఈ సభకు అతిథులుగా మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, శాప్ ఛైర్మన్ రవినాయుడు పాల్గొంటారన్నారు. వర్డ్ ప్రతినిధి డాక్టర్ గంగాధర్, బోటనీ అధ్యాపకుడు వేణు, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ పాకనాటి హరికృష్ణ, కల్చరల్ కో-ఆర్డినేటర్ పత్తిపాటి వివేక్ చౌదరి తదితరులు పాల్గొన్నారు. కాగా, 27న పద్మావతి మహిళా యూనివర్సిటీ ఆడిటోరియంలోనూ అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నారు.

'మహా' మోసం

- కుంభమేళాలో సౌకర్యాలు కల్పిస్తామంటూ రూ.3.65 లక్షలు కాజేసిన నిందితులు
- బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు

తిరుపతి(నేరవిభాగం), జనవరి 21(ఆంధ్రజ్యోతి): మహాకుంభమేళాలో సౌకర్యాలు కల్పిస్తామంటూ రూ.3.65 లక్షలు కాజేశారు. బాధితుడు, న్యాయవాది సుబ్రహ్మణ్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్వీ యూనివర్శిటీ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ రామయ్య తెలిపిన ప్రకారం.. తిరుపతి నగరం గాయత్రినగర్‌కు చెందిన న్యాయవాది సుబ్రహ్మణ్యం నేతృత్వంలో 27 మంది కుంభమేళాకు వెళ్లాలనుకున్నారు. అక్కడ కాటేజీలు, భోజన సౌకర్యం తదితరాలు కల్పించే వారికోసం వెబ్‌సైట్‌లో చూశారు. ఇక్కడ అవసరమైన సౌకర్యాలు కల్పిస్తామంటూ ఉత్తరాదికి చెందిన కొందరు వెబ్‌సైట్‌లో పేర్కొన్నారు. వీరిని నమ్మిన తిరుపతివాసులు మూడు అకౌంట్ల ద్వారా వారి బ్యాంకు ఖాతాలకు రూ.3.65 లక్షలు పంపారు. ఆ తర్వాత 27 మంది కుంభమేళాకు వెళ్లడానికి సిద్ధమయ్యారు. అయితే, డబ్బులు పంపాక వారిని సంప్రదించడానికి ప్రయత్నిస్తే వారి సెల్‌ఫోన్లు స్విచ్ ఆఫ్ లేదా తాత్కాలికంగా పనిచేయడంలేదని వచ్చింది. రెండు రోజులు పాటు వీరు ఫోన్లలో ప్రయత్నిస్తూనే ఉన్నారు. చివరకు మంగళవారం ఎస్వీయూ స్టేషన్‌లో బాధితుల తరఫున న్యాయవాది సుబ్రహ్మణ్యం ఫిర్యాదు చేశారు. సీఐ రామయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అలిపిరిలో కట్టుదిట్టంగా తనిఖీలు

తిరుమల, జనవరి 21(ఆంధ్రజ్యోతి): తిరుమల నుంచి ఎర్రచందనాన్ని అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారంతో విజిలెన్స్, ఫారెస్ట్ సిబ్బంది అలిపిరి వద్ద నిఘా పెట్టారు. మంగళవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. తిరుమల నుంచి తిరుపతికి చేరుకున్న తర్వాత కూడా వాహనాలు ఆపి తనిఖీలు చేయడంతో పలువురు భక్తులు ఏం జరిగిందో తెలియక కంగారుపడ్డారు.



టీడీపీతోనే అభివృద్ధి, సంక్షేమం: నెలవల



సమావేశంలో మాట్లాడుతున్న నియోజకవర్గ నెలవల తదితరులు

నాయుడుపేట టౌన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం టీడీపీతోనే సాధ్యమవుతుందని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో మంగళవారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంతో మంది ఆంధ్రులు పోరాటాలు, త్యాగాలతో ఏర్పాటైన విశాఖ ఉక్కు పరిశ్రమను గత వైసీపీ ప్రభుత్వం నష్టాల ఊబిలో కూరుకునేలా చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషితో కేంద్రం విశాఖ ఉక్కు పరిశ్రమ కోసం రూ.11,440 కోట్ల ఆర్థిక ప్యాకేజీని కేటాయించడం శుభపరిణామమన్నారు. అలాగే పోలవరం నిర్మాణానికి రూ12వేల కోట్ల నిధులు తీసుకురావడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వంపై రూ.10 లక్షల కోట్ల ఆర్థిక భారం ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సంచి కృష్ణయ్య, పసల గంగాప్రసాద్, చక్రపాణి, ప్రసాద్‌నాయుడు, అవధానం సుధీర్, నానాబాల సుబ్బారావు, బిరదవాడ నారాయణ, రవి, తదితరులు పాల్గొన్నారు.

జీవితంలో క్రీడలు భాగం కావాలి



విజేతలకు నగదు, షీల్డ్ అందచేస్తున్న సుబ్రహ్మణ్యం

డక్కిలి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): జీవితంలో క్రీడలు ఓ భాగంగా ఉండాలని, అప్పుడే ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటారని విశ్రాంత ఉపాధ్యాయుడు పునుగోటి సుబ్రహ్మణ్యం అన్నారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా డక్కిలి మండలం లింగసముద్రం గ్రామంలో నిర్వహించిన క్రికెట్ పోటీలు ముగిశాయి. మంగళవారం నిర్వహించిన ఫైనల్స్‌లో లింగసముద్రం జట్టుపై డక్కిలి జట్టు విజయం సాధించింది. విజేతలకు పునుగోటి సుబ్రహ్మణ్యం తన సొంత నిధుల నుంచి రూ.70 వేల నగదు బహుమతి, షీల్డ్‌ని అందచేశారు. అలాగే రన్నర్‌గా నిలిచిన లింగసముద్రం జట్టుకు రూ.30 వేల నగదు బహుమతి గ్రామస్థులు అందించారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ తాను ఇక్కడ ఉపాధ్యాయుడుగా పనిచేసే సమయంలో క్రీడల్లో యువతను ప్రోత్సహించడం వల్ల గత 25 సంవత్సరాలుగా ఏటా సంక్రాంతి సందర్భంగా క్రికెట్ పోటీల నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు.

గంగ కాలువకు గండి



గంగకాలువకు గండిపడటంతో వృథాగా పోతున్న నీరు

కోట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): కోట మండలం ఊనుగుంటపాళెం వద్ద తెలుగుగంగ కాలువకు మంగళవారం గండిపడింది. గత మూడు రోజుల నుంచి వెంకటగిరి మండలం ఊట్లపల్లి నుంచి 5వ బ్రాంచ్ కెనాల్ ద్వారా 250 క్యూసెక్కుల కండలేరు జలాలు కోట మండలం కొండుగుంట మీదుగా చిట్టేడులోని అత్తిమిట్ట చెరువుకు వెళ్తున్నాయి. కాలువలో ప్రవాహం ఓవర్‌ఫ్లో అవడంతో నీళ్లన్నీ తాటిచెరువు కింద ఉన్న ఆయకట్టు పొలాల్లోకి ప్రవహించడంతో సుమారు 30 ఎకరాల్లో వెన్నుదశలో ఉన్న వరి పంటలు నేలవాలిపోయాయి. దీంతో తెలుగుగంగ ఇన్‌చార్జి ఏఈ నిరంజన్‌కుమార్ ఆధ్వర్యంలో గండిని పూడ్చివేశారు.

అంగన్‌వాడీ పిల్లలకు ఆధార్ నమోదు



పిల్లలకు ఆధార్ సీడింగ్ చేయిస్తున్న సీడీపీవో షంషాద్ బేగం

వెంకటగిరి టౌన్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి ఐసీడీఎస్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు ఆధార్ నమోదు చేయించాలని సీడీపీవో షంషాద్ బేగంగా ఆదేశించారు. మంగళవారం స్థానిక సీహెచ్‌సీలో ఆధార్ కేంద్రం వద్ద పిల్లలకు ఆధార్ నమోదు చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు తల్లిదండ్రుల ద్వారా ఆధార్ నమోదు చేయించాలని ఆదేశించామన్నారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సర్వీస్ ప్రొవైడర్స్ క్యాంపునకు విశేష స్పందన



కార్యక్రమంలో మాట్లాడుతున్న మెప్మా సిటీ మిషన్ మేనేజర్ పెంచలయ్య

గూడూరు అర్బన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో మెప్మా, హోమ్ ట్రైయాంగిల్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన సర్వీస్ ప్రొవైడర్ క్యాంపునకు విశేష స్పందన లభించింది. బ్యూటీషియన్, ఎలక్ట్రీషియన్, కంప్యూటర్, ప్లంబర్, టెలివిజన్, ఏసీ, రిఫ్రిజిరేటర్ తదితర మెకానిక్ కోర్సులలో శిక్షణ కోసం అభ్యర్థనలు అందాయి. ఈ సందర్భంగా మెప్మా సిటీ మిషన్ మేనేజర్ పెంచలయ్య మాట్లాడుతూ హోమ్ అప్లయిన్స్ హ్యాండ్‌మెడ్ వర్కులు, బ్యూటీషియన్ రంగాల్లో శిక్షణ ఇప్పించడమే కాకుండా ప్రతిరోజు పని ఉండేలా ఉపాధి కల్పించి ఆర్థికంగా బలోపేతం చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సీవో చందన, లత, సులోచనమ్మ, ఉషా, లక్ష్మి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

వాకాడు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కార్యకర్త పల్లాపు మునెయ్య(67) సోమవారం మృతి చెందింది. ఆమె అంత్యక్రియల కోసం ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ టీడీపీ నాయకులు తీపలపూడి రమణయ్య, మల్లాపు రమణయ్య, వెంకటాద్రి, ప్రదీప్‌కుమార్ ద్వారా రూ.5వేలు అందజేశారు.

గణతంత్ర వేడుకలకు వెంకటగిరి విద్యార్థి



వివేక్

వెంకటగిరి టౌన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టీచర్స్ కాలనీకి చెందిన మద్దిల లక్ష్మణ్, లక్ష్మి దంపతుల కుమారుడు వివేక్ ఈనెల 26వ తేదీన ఢిల్లీలో జరగనున్న గణతంత్ర వేడుకలకు ఎంపికయ్యాడు. మచిలీపట్నంలో కృష్ణా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలలో సీఎస్ఈ రెండో సంవత్సరం చదువుతున్న వివేక్ డెహ్రాడూన్‌లోని ఇండియన్ మిలిటరీ అకాడమీ అటాచ్‌మెంట్ శిబిరానికి ఏపీ ఎన్‌సీసీ విభాగం నుంచి ఎంపికయ్యాడు. గతేడాది డిసెంబరు 23 నుంచి ఈనెల 3వ తేదీ వరకు శిక్షణ పూర్తి చేసుకున్నాడు. అక్కడ జరిగిన వాలీబాల్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచి గార్డ్ ఆఫ్ హానర్ పథకం సాధించాడు. ఈనెల 26వ తేదీన ఢిల్లీలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సమక్షంలో జరిగే పెరేడ్‌లో పాల్గొంటాడు. తమ కుమారుడు ఢిల్లీలో గణతంత్ర వేడుకల్లో పాల్గొనేందుకు ఎంపికవడం పట్ల వివేక్ తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు.

ఇసుక ట్రాక్టర్ల స్వాధీనం

చిట్టమూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మెట్టు స్వర్ణముఖి నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న 8 ట్రాక్టర్లను పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ చిన్న బలరామయ్య తెలిపారు. ట్రాక్టర్లను మైనింగ్ అధికారులకు అప్పగించామని చెప్పారు.



మన్నారుపోలూరు, టిడ్కో, ఇళ్ల సమీపంలోని జగనన్న కాలనీలో మట్టి తవ్వడంతో ఏర్పడిన గుంతలు

జగనన్న కాలనీల్లోనూ తవ్వేస్తున్నారు!

- యథేచ్ఛగా మట్టి అక్రమ తవ్వకాలు
- గుంతలమయంగా పేదల ఇళ్ల స్థలాల లేఅవుట్
- చోద్యం చూస్తున్న అధికారులు

సూళ్లూరుపేట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో మట్టి అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. పేదల ఇళ్ల స్థలాలు ఇచ్చిన జగనన్న కాలనీ లేఅవుట్‌లోనూ మట్టిని అక్రమంగా తవ్వి తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇదంతా తెలిసిన అధికారులు చోద్యం చూస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వైసీపీ ప్రభుత్వ హయాంలో సూళ్లూరుపేట మున్సిపాలిటీలోని మన్నారుపోలూరు రెవెన్యూ పరిధిలో శ్రీకాళహస్తికి వెళ్లే రోడ్డు పక్కన సర్వే నెంబరు 100-1, 101-3, 100-2ఎ, 100-3, 231లో 30.54 ఎకరాలు, సర్వే నెంబరు 270లో 9.98 ఎకరాలు కలిపి మొత్తం 40.50 ఎకరాల్లో పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు రెండు లే అవుట్లు ఏర్పాటు చేశారు. స్థలాలు ఇవ్వగా కొంతమంది లబ్ధిదారులు గృహాలు సైతం నిర్మించుకున్నారు. ఇటీవల కొందరు అక్కడ ఉన్న రెండు లే అవుట్ల నుంచి గ్రావెల్ ఇబ్బడి ముబ్బడి తవ్వి కొత్తగా వేస్తున్న వెంచర్లకు తరలిస్తున్నారు. ఇదేమని ప్రశ్నించినా సరైన సమాధానం చెప్పడం లేదని ఇళ్ల స్థలాల లబ్ధిదారులు వాపో తున్నారు. నివేశ స్థలాల లే అవుట్‌లో గ్రావెల్ తవ్వడంతో భారీ గుంతలు ఏర్పడుతున్నారు. అదే విధంగా టిడ్కో ఇళ్ల ఎదురుగా ఉన్న జగనన్న కాలనీలో మట్టిని అందినకాడికి తవ్వేసి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఈ మట్టి మాఫియా వైసీపీ నాయకుల కనుసన్నల్లో జరుగుతోందని, వీరికి అధికార పార్టీకి చెందిన నేతల అండదండలు ఉండటంతో అడ్డూఅదుపు లేకుండా పోతోందని స్థానికులు చెబుతున్నారు. అధికారులు స్పందించి ఇళ్ల స్థలాల్లో మట్టి తవ్వకాలను అరికట్టాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

ముఖ్యమంత్రి కృషితోనే విశాఖ ఉక్కుకు ఆర్థిక భరోసా: పాశం

గూడూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషితోనే విశాఖ ఉక్కు కర్మాగారానికి రూ.11,440 కోట్లు ప్యాకేజీని కేంద్రం అందించిందని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. మంగళవారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం విశాఖ ఉక్కు కర్మాగారాన్ని పట్టించుకోకపోవడంతో నష్టాల ఊబిలో కూరుకుపోయిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉక్కు కర్మాగారానికి పూర్వవైభవం తీసుకువచ్చేలా సీఎం చంద్రబాబు ఎంతో కృషి చేశారన్నారు. ఫలితంగా కేంద్ర క్యాబినేట్ రూ.11,440 కోట్ల ప్యాకేజీని ప్రకటించిందన్నారు. కార్యక్రమంలో పులిమి శ్రీనివాసులు, బిల్లు చెంచురామయ్య, అబ్దుల్ రహీం, వెంకటేశ్వర్లురాజు, ఇశ్రాయిల్‌కుమార్, గుండాల లీలావతి, జలీల్‌అహ్మద్, కోటేశ్వరరావు, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

వైసీపీ నాయకుల నుంచి ప్రభుత్వ భూములను కాపాడండి



సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనాతో మాట్లాడుతున్న కొత్తపాళెం గ్రామస్తులు

చిట్టమూరు, జనవరి 21(ఆంధ్రజ్యోతి): పశువుల మేత కోసం వదిలి పెట్టిన ఉప్పుటేరు ప్రభుత్వ భూములను వైసీపీ నాయకులు దౌర్జన్యంగా ఆక్రమించుకుని సాగు చేస్తున్నారని బురదగాలి కొత్తపాళెం గ్రామస్తులు మంగళవారం గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనాకు ఫిర్యాదు చేశారు. బురదగాలి కొత్తపాళెం రెవెవిన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 1లో ఉప్పుటేరు ప్రభుత్వ భూమిని పశువుల మేత కోసం వదిలిపెట్టారని, ఆ భూములను ఇదే గ్రామానికి చెందిన గిరిరెడ్డిఆక్రమించుకున్నారని, తహసీల్దారు హెచ్చరిక బోర్డు పెట్టినప్పటికీ లెక్క చేయకుండా వరి సాగుకు సిద్ధపడ్డారని తెలిపారు. విచారించి తగు చర్యలు తీసుకుంటామని సబ్ కలెక్టర్ చెప్పారు.

నిమ్మ పరిశోధనా కేంద్రానికి యంత్రాల వితరణ



యంత్రాలు అందజేస్తున్న నరేంద్ర నాథ్

వెంకటగిరిటౌన్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): వెంకటగిరిలోని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం నిమ్మ, చీని పరిశోధనా కేంద్రానికి మేనకూరు సెజ్‌లోని ఇండస్ కాఫీ పరిశ్రమ డైరెక్టర్ నరేంద్ర నాథ్ యంత్రాలను వితరణ చేశారు. మంగళవారం నిమ్మ పరిశోధనా కేంద్రంలో శాస్త్రవేత్త డాక్టర్ శ్యాం సుందర్ రెడ్డికి యంత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఇండస్ డైరెక్టర్ నరేంద్రనాథ్ మాట్లాడుతూ కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా రెండు పవర్ వీడర్ మెషిన్లు, కొమ్మలు కత్తిరించే యంత్రం, గట్ల మీద కలుపు గడ్డి కోత యంత్రం, 75 అంగుళాల ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్ డిస్ప్లేలను అందించామన్నారు. కార్యక్రమంలో ఇండస్ కాఫీ పరిశ్రమ జీఎం మనీష్ మిశ్ర, హెచ్‌ఆర్ హెడ్ రమేష్, సీఎఫ్‌వో మహేష్, సిబ్బంది పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్ పరీక్షా కేంద్రం పరిశీలన



కళాశాలలో అధికారులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్, డీఎస్పీ

కోట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో జేఈఈ మెయిన్స్ పరీక్ష కేంద్రాలను మంగళవారం గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనా, డీఎస్పీ గీతాకుమారి పరిశీలించారు. ఈ కళాశాలలో ఈనెల 30వ తేదీ వరకు జేఈఈ మెయిన్స్ పరీక్షలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో పరీక్షా కేంద్రంలో వసతులు, ల్యాబ్‌లు కంప్యూటర్లను సబ్ కలెక్టర్, డీఎస్పీ, పరిశీలించారు. అనంతరం తహసీల్దారు జయజయరావు, ఎంపీడీవో వేణుతో చర్చించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయ కుమార్‌రెడ్డి, ప్రాంగణ ఎంపికల అధికారి డాక్టర్ కిషోందర్, వాకాడు సీఐ హుస్సేన్‌బాషా, స్థానిక ఎస్ఐ పవన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పోరుబాట

పెళ్లకూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మండలంలోని రోసనూరు గ్రామంలో మంగళవారం వైసీపీ నాయకులు పోరుబాట నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ నన్నం ప్రిస్కిల్లా మాట్లాడుతూ ఎన్నికల హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎన్డీసీసీబీ మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ఇలకా సుధారాణి, ఎంపీటీసీలు కన్నలి కుమార్‌స్వామి, సుజాత, నాయకులు అట్ల కృష్ణయ్య, కామిరెడ్డి రాజారెడ్డి, తంబిరెడ్డి సుబ్రహ్మణ్యంరెడ్డి, ఎల్లు మోహన్, పగడాల హరిబాబురెడ్డి, సాగి జితేంద్ర, బండి బాలు తదితరులు పాల్గొన్నారు.

ఉనికి కోసమే వైసీపీ పోరాటం: టీడీపీ



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

పెళ్లకూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఉనికి కోసమే వైసీపీ పోరాటం చేస్తోందని టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, స్వర్ణముఖి ఆనకట్ట ఆయకట్టు ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ దామెర ప్రసాద్ నాయుడు అన్నారు. మంగళవారం మండలంలోని తాళ్వాయిపాడు గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులపాలు చేయడంతో ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని కొనియాడారు. పేదల కోసం సంక్షేమ పథకాలను తీసుకొచ్చింది టీడీపీనేనని అన్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు వైసీపీ నాయకులు కుయుక్తులను పన్నుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నేలవల్లి సిద్దులయ్య నాయుడు, మాడుపూరు సిద్దులయ్య నాయుడు, పరుశురామ్, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

నాన్‌టీచింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

గూడూరు అర్బన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాల నాన్ టీచింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రశేఖర్‌రెడ్డి, రాధాకృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని రిటైర్డ్ ఎంప్లాయిస్ ఉద్యోగుల భవనంలో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో వారు మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా చట్టప్రకారం ఉద్యోగులకు ఇవ్వాల్సిన వేతనాలను తగ్గించి, ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేసిన యాజమాన్యం నిరంకుశ విధానాలను తూర్పార పట్టారు. నాన్‌టీచింగ్ ఉద్యోగులు సర్వీసులో మరణించినా వారి కుటుంబ సభ్యులకు కారుణ్య నియమాకాలు, న్యాయంగా రావాల్సిన ప్రయోజనాలను ఇవ్వకపోవడం బాధకరమన్నారు. యాజమాన్యం నిరంకుశ వైఖరిని వీడనాడి నాన్‌టీచింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం విషయంలో కోర్టు తీర్పును తక్షణం అమలు చేయాలని కోరారు. సమావేశంలో బిల్లు చెంచురామయ్య, అబ్దుల్‌రహీం, ఇశ్రాయిల్ కుమార్, నయూం, భాస్కర్‌గౌడ్, చంద్రశేఖర్, ప్రభాకర్, శశికుమార్, బీవీ రమణయ్య పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పాల్గొన్న నాయకులు

డీఎస్పీకి అభినందనలు



డీఎస్పీ గీతాకుమారిని సన్మానిస్తున్న శ్రీనివాసులు, సులక్ష్మి

గూడూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): గూడూరు డీఎస్పీ గీతా కుమారిని మంగళవారం సునీత సేవా సంస్థ ప్రతినిధులు సారంగం శ్రీనివాసులు, సులక్ష్మి మర్యాదపూర్వంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సన్మానించి అభినంద నలు తెలిపారు.

క్రీడాకారులకు ప్రశంస

గూడూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధిలోని క్రీడాకారులు జాతీయ స్థాయిలో సత్తాచాటడం ఆనందంగా ఉందని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. 80 మీటర్ల హ్యాడిల్స్ గోల్డ్‌మెడల్ సాధించిన తనూజ్ తేజను అభినందించారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.పది లక్షల నగదు బహుమతికి తాను సిఫారస్సు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

పెళ్లకూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 20 నుంచి 31వ తేదీ వరకు ఏర్పాటు చేస్తున్న పశువైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య కోరారు. మంగళవారం కొత్తూరు, పెళ్లకూరు గ్రామాల్లో ఏర్పాటు చేసిన పశువైద్య శిబిరాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పశు వైద్యుడు గుణశేఖర్ మాట్లాడుతూ వైద్య శిబిరాల్లో పశువులకు ఎటువంటి వ్యాధులు సోకినా ఉచితంగా చికిత్స చేసి మందులు అందిస్తామన్నారు. అనంతరం పశువులకు గర్భకోశ వ్యాధుల నివారణకు, దూడలకు నట్టల నివారణ మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎల్ఎస్ఏ విజయ, వెటర్నరీ సిబ్బంది లతవ్యకుమార్, ప్రేమ్‌కుమార్ పెంచలమ్మ, ప్రభావతి, నికోరాణి, ముకుంద తదితరులు పాల్గొన్నారు.

లెనిన్‌కు నివాళి

గూడూరు అర్బన్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో సీపీఐ ఆధ్వర్యంలో విప్లవ వీరుడు లెనిన్ వర్ధంతి జరిగింది. ఆయన చిత్రపటానికి పలు రాజకీయ పార్టీల నాయకులు నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రభాకర్, చంద్రశేఖర్‌రెడ్డి, రాధాకృష్ణ, ఎంబేటి చంద్రయ్య, జమాలుల్లా, కాలేషా, రమేష్, శశికుమార్, సీపీఐ నాయులు, ఏఐటీయూసీ, బీఎస్పీ, కాంగ్రెస్, ఇన్సాఫ్ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడికి సన్మానం



శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న విజయభాస్కర్ రెడ్డి, దయాకర్ రెడ్డి

సూళ్లూరుపేట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): బీజేపీ జిల్లా నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన సామంచి శ్రీనివాస్‌ను మంగళవారం తిరుపతిలో సూళ్లూరుపేటకు చెందిన బీజేపీ నాయకులు ఆరణి విజయ భాస్కర్ రెడ్డి, సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. శ్రీనివాస్‌ను శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు.

మద్యం మత్తులో రోగులతో అసభ్య ప్రవర్తన

సూళ్లూరుపేట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఓ వ్యక్తి ప్రభుత్వాస్పత్రిలోకి వెళ్లి రోగులతో అసభ్యంగా ప్రవర్తించి, ఓ రోగిపై చెయ్యి చేసుకొన్న ఘటన మంగళవారం సూళ్లూరుపేటలో చోటుచేసుకొంది. స్థానికుల సమాచారం మేరకు.. ఎమర్జెన్సీ కొత్త వార్డు భవనంలోకి మద్యం సేవించిన ఓ గుర్తు తెలియని వ్యక్తి చొరబడి అక్కడ చికిత్స పొందుతున్న వారితో అసభ్యంగా మాట్లాడుతూ ఓ రోగిపై చెయ్యి చేసుకొన్నాడు. వెంటనే అక్కడున్న రోగుల బంధువులు, ఆస్పత్రి సిబ్బంది మద్యం మత్తులో ఉన్న వ్యక్తికి దేహశుద్ధి చేసి ఆస్పత్రి నుంచి బయటకు పంపించేశారు.

అన్నచెరువు అలుగు నిర్మాణం చేపట్టండి



పొలాల వద్ద మాట్లాడుతున్న రైతులు

వాకాడు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండాపురం అన్న చెరువు అలుగు నిర్మాణం చేపట్టకపోవడంతో తమ భూములు ముంపునకు గురవుతున్నాయని కొండాపురం, వడ్డిపాళెం గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం వారు మాట్లాడుతూ అలుగు తొలగించడంతో తెలుగుగంగ జలాలు చెరువులోకి చేరినప్పుడు ఒప్పొంగి తమ భూములు మునిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. 150 ఎకరాలకు పైగా భూమి వరదనీటిలో ఉండాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. పలుమార్లు ఇరిగేషన్ అధికారులకు వినతిపత్రం అందజేసినప్పటికీ పరిష్కారం చూపలేదన్నారు. ఇకనైనా అధికారులు స్పందించి తమ సమస్యకు పరిష్కారం చూపాలని రైతులు కోరారు.

చిన్నారులకు ఆధార్ తప్పనిసరి

పిచ్చాటూరు, జనవరి 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలతో పాటు అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం అందాలంటే ఆరు సంవత్సరాల్లోపు చిన్నారులకు ఆధార్‌కార్డు తప్పనిసరి అని ఎంపీడీవో మహ్మద్‌రఫి తెలిపారు. మంగళవారం ముడియూరు సచివాలయంలో చిన్నారులకు ఆధార్ న మోదు ప్రక్రియను ఆయన ప్రారంభించా రు. సచివాలయ పరిధిలోని 6 అంగన్ వాడీ కేంద్రాల కార్యకర్తలు ఆధార్ నమోదు కాని చిన్నారులను వారి తల్లిదండ్రుల ద్వారా కేంద్రానికి తీసుకొచ్చి నమోదు చేయించారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన



గ్రామీణులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

శ్రీసిటీ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): శ్రీసిటీలోని 'టిల్ హెల్త్‌కేర్' పరిశ్రమ తన కార్పొరేట్ సామాజిక బాధ్యత కార్యక్రమాల్లో బాగంగా శ్రీసిటీ ఫౌండేషన్‌తో కలిసి చెరివి గ్రామంలో మంగళవారం మూడు రోజుల ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించింది. శ్రీసిటీలోని శంకర్ నేత్రాలయ ఆస్పత్రి కంటి వైద్యులు, పారా మెడికల్ సిబ్బంది వైద్య సేవలందించారు. మొదటి రోజు 145 మందికి పైగా కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి కంటి మందులను టిల్ హెల్త్‌కేర్ యాజమాన్యం పంపిణీ చేసింది. టిల్ హెల్త్‌కేర్ పరిశ్రమ నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం పట్ల శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి ప్రశంసించారు. కార్యక్రమంలో టిల్ హెల్త్‌కేర్ ప్లాంట్ ఆపరేషన్స్ హెడ్ అరుణ్ మంగ్లా, వైస్ ప్రెసిడెంట్ మనోజ్‌కుమార్ రాతి, మార్కెటింగ్ మేనేజర్ మనోజ్ నాయర్, హెచ్‌ఆర్ మేనేజర్ రవిచంద్ర, శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్ రమేష్‌కుమార్, శ్రీసిటీ ఫౌండేషన్ సీనియర్ మేనేజర్ సురేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పరశురామేశ్వరుడి సేవలో ఆర్కియాలజీ కమిషనర్



ఏర్పేడు, జనవరి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడిమల్లంలో వెలసిన పరశురామేశ్వర ఆలయంలో స్వామి వారిని రాష్ట్ర ఆర్కియాలజీ శాఖ కమిషనర్ వాణిమోహన్ కుటుంబ సమేతంగా మంగళవారం దర్శించుకున్నారు. మాజీ చైర్మన్ బత్తల గిరినాయుడు, ఈవో రామచంద్రారెడ్డి వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదపండితులు వారిని ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.

బాలికల బాల్యాన్ని కాపాడుదాం

ఏర్పేడు, జనవరి 21(ఆంధ్రజ్యోతి): బాలికలు బంగారం అని వారి బాల్యాన్ని కాపాడడం అందరి బాధ్యత అని ప్రగతి సంస్థ కోఆర్డినేటర్ మంజూష అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రోచైల్డ్ గ్రూప్, చైల్డ్ రైట్స్ అడ్వకెసి ఫోరం ఆర్థిక సాయంతో పాపానాయుడుపేట ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, జూనియర్ కళాశాలల్లో బాలికల భద్రత పోస్టర్లను ఆవిష్కరించారు. ఈనెల 24న శుక్రవారం జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని అవగాహన సదస్సులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మధురిమ, పీహెచ్‌ఎన్ అన్నపూర్ణ, సూపర్‌వైజర్ సుబ్రహ్మణ్యం, స్టాఫ్ నర్సు శాలిని, ఎల్‌టీ మాధవి, ఫార్మసిస్టు నాగభూషం, కళాశాల ప్రిన్సిపాల్ వెంకటసుబ్బమ్మ, అధ్యాపకులు, ప్రగతి సంస్థ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

ప్రధాన రహదారికి మరమ్మతులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



కేవీబీపురం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పిచ్చాటూరు - శ్రీకాళహస్తి ప్రధాన రహదారిలో రాజులకండ్రిగ వద్ద ప్రధాన రహదారికి తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. 'ప్రధాన రహదారికి మరమ్మతులు చేయండి' శీర్షికన సోమవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో వార్తా కథనం ప్రచురితమైంది. దీంతో మంగళవారం ప్రధాన రహదారికి తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. నీరు తగ్గితే శాశ్వత రోడ్డు నిర్మిస్తామని ఆర్‌అండ్‌బీ అధికారులు తెలిపారు.

మద్యం దుకాణ యజమాని బరి తెగింపు

● తెలుగుగంగ కాలువ పూడ్చి దారి ఏర్పాటు



వరదయ్యపాళెం, జనవరి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నపాండూరు పంచాయతీలోని అపోల టైర్ల పరిశ్రమకు వెళ్లే మార్గంలో ఇటీవల మద్యం దుకాణం ఏర్పాటు చేశారు. దుకాణ యజమాని అక్కడ ఉన్న తెలుగుగంగ ఉప కాలువను పూడ్చి తన దుకాణానికి దారి ఏర్పాటు చేసుకున్నాడు. ఇక దుకాణం కూడా స్త్రోత్రియ భూముల్లో నిర్మించాడు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు. రైతుల అవసరాలకు తవ్విన కాలువను పూడ్చివేస్తే పట్టించుకోవడం లేదంటున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి పూడ్చివేతకు గురైన తెలుగుగంగ ఉప కాలువను పునరుద్ధరణ చేయాల్సిన అవసరం ఉందని ఆ ప్రాంత ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

పుత్తూరు వార్తలు

సీఎం చొరవతోనే విశాఖ ఉక్కుకు ఆర్థిక భరోసా

తాకట్టుకు యత్నించిన గత వైసీపీ ప్రభుత్వం ● ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్



పుత్తూరు అర్బన్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు.. ఆంధ్రుల హక్కు. పోరాటం నుంచి రాష్ట్ర మణిహారంగా అవతరించిన విశాఖ స్టీల్ ప్లాంట్ సీఎం చంద్రబాబు కృషితో ఆర్థిక భరోసా లభించిందని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. ఈ మేరకు ఎన్డీఏతో పాటు సీఎంకు కృతజ్ఞతలు తెలియజేస్తూ ఆయన మంగళవారం ప్రకటన విడుదల చేశారు. సీఎం చంద్రబాబు హస్తినకు వెళ్లి వచ్చిన ప్రతిసారీ రాష్ట్రానికి కేంద్రం గుడ్‌న్యూస్ చెప్తూనే ఉందన్నారు. కావాలంటే రాష్ట్రాన్ని తాకట్టుపెడతానని, తనపై ఉన్న కేసుల నుంచి విముక్తి కల్పించండంటూ వైసీపీ అధినేత, అప్పటి సీఎం జగన్ ఢిల్లీ వెళ్లేవాడని దుయ్యబట్టారు. ఆర్థిక సంక్షోభంతో వెంటిలేటర్ దశకు చేరుకున్న స్టీల్ ప్లాంట్‌కు రూ.11,440 కోటల మంజూరుతో కేంద్రం జీవం పోసిందన్నారు. ఏటా 7.3 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యమున్న స్టీల్ ప్లాంట్ గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా అప్పుల్లో కూరుకుపోయిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఈ పరిశ్రమను ప్రైవేటు పరం ఎలా చేయాలని, ఆస్తులను ఎలా విక్రయించాలనే ప్రయత్నం చేశారన్నారు. ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే ఉత్తరాంధ్ర అభివృద్ధితో పాటు స్టీల్ ప్లాంట్ పట్ల ప్రత్యేక దృష్టిని సారించిందన్నారు. ఉక్కు పరిశ్రమ అభివృద్ధికి, కార్మికులు, ఉత్తరాంధ్ర ప్రజల సంక్షేమానికి కట్టుబడి పనిచేసేది టీడీపీ అని చెప్పుకునేందుకు గర్వంగా ఉందన్నారు. తప్పుడు కూతలతో వైసీపీ ఎంతటి దుష్ప్రచారం చేసినా ప్రజలు వాస్తవాలను గమనిస్తున్నారని వివరించారు.

శరవేగంగా సిమెంట్ రోడ్ల నిర్మాణం



జీహెచ్ పురంలో సిమెంట్ రోడ్డు నిర్మాణాన్ని ప్రారంభిస్తున్న నాయకులు, అధికారులు

వడమాలపేట, జనవరి 21(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో టీడీపీ ప్రభుత్వంలో సిమెంట్ రోడ్ల నిర్మాణాలను నెలాఖరులోగా పూర్తి చేస్తామని చిత్తూరు పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి ధనంజయులు నాయుడు చెప్పారు. మండలంలోని ఎస్వీ పురం పంచాయతీ జీహెచ్ పురంలో ఉపాధి హామీ పథకం ఆధ్వర్యంలో సిమెంట్ రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. గ్రామంలో రూ.4.50 లక్షలతో సిమెంట్ రోడ్డు నిర్మించనున్నారు. తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షుడు మునిశేఖర్ మాట్లాడుతూ... మండలంలో ఉపాధి హామీ పథకంలో జరుగుతున్న సిమెంట్ రోడ్ల నిర్మాణాలను శరవేగంగా పూర్తి చేస్తామన్నారు. టీడీపీ నాయకులు నితీష్, గిరిప్రసాద్, హేమావతి, లోకనాథం, చంద్రశేఖర్, ఎంపీడీవో శేషగిరి రావు, ఏఈ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌కో ఏఈగా సుబ్రహ్మణ్యంరెడ్డి

పిచ్చాటూరు, జనవరి 21(ఆంధ్రజ్యోతి): మండల విద్యుత్ ఇన్‌చార్జి ఏఈగా సుబ్రహ్మణ్యంరెడ్డి బాధ్యతలు చేపట్టారు. ఆయన వరదయ్యపాళెం సబ్ ఇంజనీర్‌గా విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నిరంతరాయ విద్యుత్ సరఫరాకు కృషి చేస్తానన్నారు.

అభివృద్ధి బాట

అయ్యలనాడు చెరువులో వాకింగ్ ట్రాక్ నిర్మాణం



అయ్యలనాడు చెరువులో ప్రారంభానికి సిద్ధమైన వాకింగ్ ట్రాక్

శ్రీకాళహస్తి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలో కూటమి పాలనతో అభివృద్ధికి బాటలు పడుతున్నాయి. గత వైసీపీ పాలనలో అభివృద్ధి అంధకారంగా మారిందని అన్ని వర్గాల నుంచి విమర్శలు వెల్లువెత్తాయి. దివంగత మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి శ్రీకాళహస్తి అభివృద్ధి ప్రదాతగా ప్రజల్లో కీర్తి పొందారు. గత ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థిగా ఆయన తనయుడు బొజ్జల సుధీర్‌రెడ్డిని స్థానికులు అభివృద్ధి ఆకాంక్షతో ఎమ్మెల్యేగా గెలిపించారు. ప్రభుత్వాస్పత్రి రోడ్డును మంత్రిగా బొజ్జల గోపాలకృష్ణారెడ్డి హయాంలో ఎంతగానో అభివృద్ధి చేశారు. గత ఐదేళ్లల్లో ఈ రోడ్డు గుంతలమయంగా మారడంతో పాటు పందుల సంచారం, వ్యర్థాలకు నిలయంగా మారింది. స్థానిక ప్రజలు ప్రభుత్వాస్పత్రి రోడ్డును సుందరీకరణ చేయాలని గత ఎన్నికల సందర్భంగా కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యేగా గెలిచిన బొజ్జల సుధీర్‌రెడ్డి ప్రభుత్వాస్పత్రి రోడ్డు సుందరీకరణపై దృష్టి సారించారు. ఇక్కడే గత ఏడాది అక్టోబరులో అన్న క్యాంటీన్‌ను ప్రారంభించారు ఆ తరువాత క్యాంటీన్‌కు ఎదురుగా ఉన్న అయ్యలనాడు చెరువు గట్టుపై వాకింగ్ ట్రాక్ పనులు ప్రారంభించారు. రూ.15లక్షలతో చేపట్టిన పనులను అధికారులు శరవేగంగా పూర్తి చేశారు. మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి పేరుతో ముస్తాబు చేసిన ట్రాక్‌ను త్వరలో ప్రారంభించేందుకు అధికారులు సన్నాహాలు చేపడుతున్నారు. ఈ వాకింగ్ ట్రాకింగ్ చూసిన పట్టణవాసులు టీడీపీ అంటే అభివృద్ధికి మారుపేరన్న నమ్మకాన్ని నిరూపించుకుందని హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సిమెంటు రోడ్ల నిర్మాణం జరిగేనా?





బ్రాహ్మణపల్లి, రంగయ్యగుంటల వద్ద ఉన్న మట్టి రోడ్లు

కేవీబీపురం, జనవరి 21(ఆంధ్రజ్యోతి): మండలంలో మట్టి రోడ్లు సిమెంటు రోడ్లుగా మారేనా అని గ్రామీణులు ఎదురు చూస్తున్నారు. ఎన్నో ఏళ్లగా మట్టిరోడ్లలో రాకపోకలు సాగించలేని పరిస్థితి ఉన్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారని వాపోతున్నారు. సూరమాల, అంజూరు, బ్రాహ్మణపల్లి, రంగయ్యగుంట, పెరిందేశం, అంజూరుపాళెం, కొత్తూరు తదితర గ్రామాలకు చేరుకోవాలంటే ఇప్పటికీ మట్టి రోడ్లే దిక్కు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రామాల్లో సిమెంట్ రోడ్ల నిర్మాణంపై దృష్టి సారించినప్పటికీ పాత సిమెంటు రోడ్లకే మళ్లీ అనుమతులు మంజూరు చేయడంపై గ్రామస్తులు మండిపడు తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మట్టి రోడ్లను సిమెంటు రహదారులుగా మార్చాల్సి ఉంది.



పాతరోడ్డుకే మెరుగులు

మైనార్టీల అభివృద్ధే ధ్యేయం: సుధీర్



ఈద్గా ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్ తదితరులు

శ్రీకాళహస్తి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): తన తండ్రి మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి స్ఫూర్తితో మైనార్టీల అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తామని ఎమ్మెల్యే సుధీర్ చెప్పారు. శ్రీకాళహస్తి పట్టణ శివార్లలోని ఈద్గా ప్రాంతాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. ఈద్గా అభివృద్ధికి అవసరమైన చర్యలపై ముస్లిం మతపెద్దలు ఎమ్మెల్యేకు విన్నవించారు. గతంలో ఈద్గా, షాదీమహల్ కోసం స్థలాలను కేటాయించారని గుర్తు చేశారు. గత వైసీపీ పాలకులు ఐదేళ్లలో ఈద్గాలో కనీస సౌకర్యాలను కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సుధీర్ మాట్లాడుతూ... శ్రీకాళహస్తి నియోజకవర్గానికి సంబంధించి ఎన్నికల సందర్భంగా మైనార్టీల అభివృద్ధి కోసం తాను ఇచ్చిన మాటను త్వరలోనే పూర్తి చేస్తానన్నారు. ఈద్గాకు రూ.60లక్షలతో ప్రహరీ సహా అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించేందుకు అంచనాలు సిద్ధం చేయాలని పురపాలక సంఘం, తొట్టంబేడు మండల అధికారులను కోరారు. అలాగే పట్టణంలోని షాదీ మహల్ మరమ్మతులకు రాష్ట్రప్రభుత్వం ఇప్పటికే నిధులు కేటాయించిందని చెప్పారు. టీడీపీ నాయకులు విజయకుమార్, చెంచయ్యనాయుడు, ఉమేష్‌రావు, మైనార్టీ నాయకులు ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రీసర్వే

వరదయ్యపాళెం, జనవరి 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూముల రీసర్వే వరదయ్యపాళెం మండలం యానాదివెట్టు రెవెన్యూ పరిధిలో ఈనెల 22నుంచి ప్రారంభించనున్నట్లు తహసీల్దారు రాజశేఖర్ తెలిపారు. మంగళవారం గ్రామంలో సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ... ప్రతి రైతూ తమ భూముల వద్ద హాజరై సర్వే చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సూళ్లూరుపేట డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్‌రావు, ఆర్‌ఐ శివకుమార్, సర్వేయర్లు, వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో బాలీవుడ్ ప్రముఖులు

శ్రీకాళహస్తి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని బాలీవుడ్ రైటర్, ప్రొడ్యూసర్ వినోద్ బచ్చన్, సింగర్ పార్థసారథి దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

కిడ్నీ బాధితుడికి సీఎం సహాయనిధి అందజేత



బాధితుడికి చెక్ అందిస్తున్న వినుత తదితరులు

శ్రీకాళహస్తి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): రేణిగుంటకు చెందిన జనసైనికుడు దేవలం జగదీష్ ఐదు సంవత్సరాలుగా రెండు కిడ్నీలు పాడైపోవడంతో డయాలసిస్ చేసుకుంటున్నాడు. ఆర్థిక పరిస్థితి, కుటుంబ పోషణపై శ్రీకాళహస్తి నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి కోట వినుతకు వివరించగా స్పందించిన ఆమె డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.12లక్షలు మంజూరు చేయించారు. మంగళవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో జగదీష్‌కు కోట వినుత చెక్కును అందజేశారు. తోట గణేష్ పాల్గొన్నారు.

మంచు దుప్పట్లో కేవీబీపురం



కేవీబీపురం, జనవరి 21(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం కేవీబీపురాన్ని రెండు రోజులుగా మంచు దుప్పటి కమ్మేస్తోంది. సోమ, మంగళవారాలు ఉదయం 10 గంటలు దాటినా మంచు వీడలేదు. దీంతో ప్రజలు చలికి అల్లాడిపోతున్నారు. వాహన చోదకులు ఎదురువ వచ్చే వాహనాలు కనబడక పోవడంతో లైట్లు వేసుకుని రాకపోకలు సాగించాల్సి వచ్చింది.

శ్మశాన వాటికలో మట్టి తరలింపు

● బయటపడుతున్న అస్థిపంజరాలు

కేవీబీపురం, జనవరి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంజూరుపాళెం గిరిజన కాలనీ శ్మశాన వాటికలో అనధికారికంగా మట్టి తరలిపోతుండడంతో అస్థిపంజరాలు బయలపడుతున్నాయి. అంజూరు పాళెం సర్వే నెం.199/1బిలో 83 సెంట్ల ప్రభుత్వ పోరంబోకును గిరిజనకాలనీ ఏర్పడినప్పటి నుంచి శ్మశానానికి కేటాయించారు. అయితే ఇటీవల గ్రామానికే చెందిన కొంతమంది ఇది పోరంబోకు భూమి అంటూ ఎక్స్‌కవేటర్లతో చదును చేస్తూ మట్టిని తరలించారు. దీనిపై గిరిజనులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయగా వారు పట్టించుకోలేదు. సంబంధిత అధికారు లు స్పందించి మట్టి తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాల్సి ఉంది.

సామంచి శ్రీనివాస్‌కు సన్మానం



శ్రీకాళహస్తి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): బీజేపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడిగా సామంచి శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా తిరుపతిలో సమావేశం నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ ఆయన్ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో చంద్రప్ప, కండ్రిగ ఉమ, మేళాగారం సుబ్రహ్మణ్యంరెడ్డి, ఎస్వీ రమణ తదితరులు పాల్గొన్నారు.

వరదయ్యపాళెం (ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా బీజేపీ అధ్యక్షుడిగా ఎన్నికైన సామంచి శ్రీనివాస్‌ను వరదయ్యపాళెం మండల బీజేపీ నాయకులు సత్కరించారు. బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి గురుదేవ్, విజయలక్ష్మి, భాస్కర్‌రెడ్డి, సిద్ధులయ్య, ఢిల్లీ ప్రకాష్‌రాయల్, గుత్తి త్యాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అధిక లోడులను అనుమతించం

కేవీబీపురం, జనవరి 21(ఆంధ్రజ్యోతి): భారీ వాహనాలను, పత్రాలు లేని వాహనాలను అనుమతించేది లేదని ఎంవీఐ దామోదరనాయుడు చెప్పారు. కేవీబీపురం పట్టణంలోని లక్షీపురం - పిచ్చాటూరు మార్గంలో మంగళవారం ఆయన వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సరైన పత్రాలు లేకపోతే జరిమానా విధిస్తామని హెచ్చరించారు. వాహనాలు రోడ్డుపైకి వచ్చినపుడు లైసెన్సుతో పాటూ వాహనానికి సంబంధించిన అన్ని పత్రాలను దగ్గర ఉంచుకోవాలని తెలిపారు.

పశువుల ఆరోగ్య శిబిరం

పిచ్చాటూరు, జనవరి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని అడవికొడియంబేడు పంచాయతీలో మంగళవారం పశు వైద్యాధికారి మంజుల ఆధ్వర్యంలో పశు ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 30 దూడలకు, 235 మేకలకు, 80 గొర్రెలకు, 90 పశువులకు నట్టల నివారణ, 20 పశువులకు కృత్రిమ గర్భధారణ చికిత్సలు, 28 పశువులకు సాధారణ చికిత్స, 220 పశువులకు బూటాక్స్ స్ప్రే చేశారు. ఏకే బేడు సర్పంచు కిరణ్‌కుమార్ నాయుడు, పశు సంవర్థక సహాయకులు విజయకుమార్, హేమంత్, మోహన్, దామోదరం పాల్గొన్నారు.

వరదయ్యపాళెం(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నపాండూరు పంచాయతీలోని రామలక్ష్మమ్మ కండ్రిగ, కారిపాకం పంచాయతీల్లో పశు వైద్య శిబిరాలను నిర్వహించారు. పశువైద్యాధికారి గౌరి, గోపాల మిత్రలు, ఏహెచ్‌ఏలు తదితరులు పాల్గొన్నారు.

మృత్యువుతో పోరాడుతున్న లిఖిత షా

రేణిగుంట, జనవరి 21(ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారి లిఖితషా ఆరోగ్యం మరింత విషమంగా మారింది. సోమవారం కుక్కల దొడ్డి వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో తల్లిదండ్రులను కోల్పోయిన లిఖితషా తలకు తీవ్ర గాయాలవడంతో అమర ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. చిన్నారి ఆరోగ్యం మరింత విషమంగా మారిందని వైద్యులు తెలిపారు. ఇదే ప్రమాదంలో చెల్లెలు సోనాలిషా, తమ్ముడు రౌద్ర గాయాల నుంచి కోలుకుని డిశ్చార్జి అయ్యారు. లిఖితషా ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో మెరుగైన చికిత్స నిమిత్తం బంధువులు హైదరాబాదుకు తీసుకెళ్లినట్లు పోలీసులు తెలిపారు.